# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 9-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి:30 సంచిక:266 పేజీలు:6 వెల: రూ.1/-


## మోదీ పూర్తి స్థాయి పర్యటన తమకు చాలా ముఖ్యమైనది

**- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర పుతిన్**

న్యూ డిల్లీ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )ప్రధాన మంత్రి మోదీ నేడు రష్యా పర్యటనకు వెళ్లనున్నారు. ఉక్రెయిన్‌పై మాస్కో యుద్ధం తర్వాత మోదీ ఆ దేశ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర పుతిన్ ఆహ్వానం మేరకు ఇవాళ, రేపు (8 ,9 తేదీల్లో) మోదీ రష్యాలో పర్యటించనున్నారు. అక్కడ 22వ భారత్ ? రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత 10వ తేదీ ఆస్ట్రియాలో అధికారిక పర్యటన చేపట్టనున్నారు.కాగా, మోదీ పరట్యనకు ముందు రష్యా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. మోదీ పూర్తి స్థాయి పర్యటన తమకు చాలా ముఖ్యమైనదని పేర్కొంది. ఈ పర్యటన పట్ల పాశ్చాత్య దేశాలు ఈర్ష్యతో వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఆ దేశం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రధాని మోదీ, అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శిఖరాగ్ర స్థాయి చర్చలు చేపడతారని వెల్లడించింది. కాగా, ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర తర్వాత మాస్కోను ప్రధాని మోదీ సందర్శించడం ఇదే తొలిసారి. అదవిధంగా.. భారత ప్రధాని ఆస్ట్రియాకు వెళ్లడం 41 ఏళ్లలో ఇదే మొదటిసారి కావడం విశేషం.

**చురక**

ప్రతి పార్టీకి ప్రాణప్రదం
ప్రాంతీయపు అస్తిత్వం
అప్పున్నా కాదన్నా
అదే నేడు జనస్వత్వం.
ప్రజలంతా ఒక్కటే ఐనా
ప్రాంత సెంటిమెంటే వేరు
ప్రభుత్వంలో మృగ్యమైతే
పడిపోవు దాని వేరు



-వేల్పుల నారాయణ
9440433475

## వైఎస్ఆర్ స్ఫూర్తితోనే సంక్షేమం, అభివృద్ధి, మూసీ ప్రక్షాళన

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : దివంగత మాజీ



ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రతోనే గతంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. అనంతరం వైఎస్ఆర్ ఫొటో ఎగ్జిభిషన్‌ను సందర్శించారు. గాంధీ భవన్ లో రేవంత్ మీడియాతో మాట్లాడారు. వైఎస్ఆర్ స్ఫూర్తితోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. రాహుల్‌కు వ్యతిరేకంగా వెళ్లే వారు వైఎస్ వారసులు కాదన్నారు. రాహుల్ ప్రధానిని చేస్తేనే పేదలకు సంక్షేమం అందుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ స్ఫూర్తితోనే సంక్షేమం, అభివృద్ధి, మూసీ ప్రక్షాళన చేపడుతామని రేవంత్ రెడ్డి వివరించారు. రాహుల్ పాదయాత్రతోనే పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ప్రశంసించారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన వారికి చైర్మన్ పదవులు ఇచ్చామని ప్రతికార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. టిపిసిసి అధ్యక్షుడిగా మూడో సంవత్సరాలు ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నామని రేవంత్ తెలియాజేశారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా బాధ్యతగా మొక్కలు పెంచాలి : మంత్రి పొన్నం

హైదరాబాద్, జులై 8 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా బాధ్యతగా మొక్కలు నాటాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఎల్బీనగర్ జోన్ పరిధిలోని రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, స్థానిక ప్రజా ప్రతినిధుల తో కలిసి మంత్రి పొన్నం మొక్కలు నాటి గ్రేటర్ హైదరాబాద్‌లో వన మహోత్సవాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. కాలుష్యం పెరిగితే భవిష్యత్ తరం మనల్ని క్షమించదన్నారు. రాబోయే తరాలకు అందమైన పుడమిని అందించాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మాస్కులు పెట్టుకోకుండా బతకాలంటే మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. నగర వ్యాప్తంగా 30 లక్షల మొక్కలు నాటేందుకు రంగం సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటడం ప్రభుత్వ బాధ్యత కాకుండా ప్రజలు కూడా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ సంవత్సరం జీహెచ్ఎంసీ పరిధిలో 30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. అందుకోసం ప్రతి ఇంటికీ మొక్కలు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిల్లలో నేడు 7,134 పైగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరాలను వెల్లడించారు.

## స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై సీఎం సమావేశం

హైదరాబాద్, జులై 8 : రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాలకు ముందే ఈ నెల 23లోపు యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని పరిశ్రమల, విద్యాశాఖల అధికారులతో పాటు పారిశ్రామికరంగ ప్రముఖులకు సూచించారు. వాటిని పరిశీలించి 24గంటల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖలతో సీఎం సోమవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై అధికారులు, ప్రముఖల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.



ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. అటు ఐటీ కంపెనీలతో పాటు ఇటు పరిశ్రమలన్నింటికీ అందుబాటులో ఉన్నందున ఈ సిటీ ప్రాంగణంలో వర్సిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఐఎస్‌బీ తరహాలో ఓ బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చర్చ జరిగింది. అప్పటివరకు ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులందరినీ తాత్కాలిక బోర్డుగా భావించాలని సీఎం నిర్ణయించారు. యూనివర్సిటీలో ఏం కోర్సులు ఉండాలి.. ఎలాంటి పాఠ్యాంశాలు ఉండాలి.. పరిశ్రమల అవసరాలు తెలుసుకొని, వాటికి అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు ఉండేందుకు ఏయే నైపుణ్యాలపై కోర్సులు నిర్వహించాలనేది ముందుగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు.

ఆర్థికపరమైన అంశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో, కరిక్యులమ్, కోర్సులకు సంబంధించి ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించాలని చెప్పారు. నిర్ణీత గడువు పెట్టుకొని ప్రతిపాదనలు రూపొందించాలని, కేవలం 15 రోజుల వ్యవధి ఉన్నందున ప్రతీ ఐదురోజులకోసారి సమావేశం కావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలా..? ప్రభుత్వమే ఈ బాధ్యతలను చేపట్టాలా? మరేదైనా విధానం అనుసరించాలా ? అనే అంశంపై పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారు చేసేందుకు ఆ రంగంలో నిపుణులైన ఒక కన్సల్టెంట్‌ను నియమించుకోవాలని, వ్యవహారాలకు పరిశ్రమలశాఖ నోడల్ డిపార్టుమెంట్‌గా వ్యవహరిస్తుందని వివరించారు.

## ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుతో ఎంతోమంది ప్రాణాలు కాపాడొచ్చు : మంత్రి కోమటిరెడ్డి





నల్లగొండ, జులై 8 : రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను రక్షించడం ఎంతో గొప్ప విషయమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం అయన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపాడు టోల్ ప్లాజా వద్ద ఏడీపీ సంస్థ ద్వారా సుమారు 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ట్రామా కేర్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రథమ చికిత్స అందించేందుకు ఏడీపీ సంస్థ ముందుకు రావడం సంతోషకరమని అన్నారు.

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అలాంటి సమయంలో వారికి తక్షణ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హాస్పిటక్‌కు పంపించేందుకు ముందుగా ట్రామా కేర్ సెంటర్‌లో చికిత్స అందించేలా ఎకరం స్థలంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు రావడం పట్ల ఏడీపీ సంస్థను అభినందించారు. దీనిని త్వరితగతిన పూర్తి చేసి సెప్టెంబర్ 7న ట్రామా కేర్ సెంటర్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఏడీపీ సంస్థను కోరారు. ప్రభుత్వం తరఫున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.

## మాట తప్పం.. మడమ తిప్పం.. రుణ మాఫీ చేసి తీరుతాం - ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, జులై 8 :ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నప్పటికీ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పై వెనక్కి తగ్గేది లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ఎట్టిపరిస్థితుల్లోనూ రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ 75 జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి పాల్గొని మాట్లాడారు. ఇతర పార్టీల నాయకులు పెద్ద ఎత్తున తిరిగి కాంగ్రెస్



లో చేరుతున్నారన్నారని ఈ చేరికల పరిణామమే రాష్ట్ర ప్రభుత్వం బాగా పని చేస్తోందనడానికి నిదర్శనం అన్నారు.

ఇక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇవాళ తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిలో దూసుకుపోతున్నదంటే దానికి వైఎస్ఆర్ హయాంలో చేపట్టిన ఓఆర్ఆర్, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, ఇతర మౌళిక సదుపాయాలే కారణం అన్నారు. వైఎస్ దీర్ఘకాలిక పునాదుల వల్ల ప్రపంచ దేశాలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయన్నారు. వైఎన్ పాలన చిరస్థాయిగా నిలుస్తుందని, వైఎస్ ఆలోచన మార్గంలో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

రాష్ట్రంలో రాబోయే రెండు దశాబ్దాలు కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం పని చేయడం కోసం వైఎస్ అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు అంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని భట్టి అన్నారు. వివిధ కారణాలతో పార్టీకి దూరమైన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైఎస్ అభిమానులు, పాత తరం కాంగ్రెస్ నాయకులంతా తిరిగి కాంగ్రెస్ లో చేరాలని ఆయన పిలుపు ఇచ్చారు.

## మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఝార్ఖండ్ మాజీ సీఎం చంపై సోరెన్

రాంచీ, జులై 8 : ఝార్ఖండ్ మాజీ సీఎం చంపై సోరెన్ మళ్లీ మంత్రి అయ్యారు. హేమంత్ సోరెన్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. చంపై సోరెన్‌తోపాటు మరో పది మంది నేతలతో మంత్రులుగా ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. సీఎం హేమంత్ సోరెన్‌తో సహా 12 మంది సభ్యుల కేబినెట్‌లో కొత్త వారికి చోటు దక్కింది. కాంగ్రెస్‌కు చెందిన జమ్తారా ఎమ్మెల్యే ఇర్ఫాన్ అన్సారీ, మహాగామా ఎమ్మెల్యే దీపికా పాండే సింగ్, జేఎంఎంకు చెందిన లతేహర్ ఎమ్మెల్యే బైదినాథ్ రామ్ మంత్రులుగా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు.

కాగా, కాంగ్రెస్‌కు చెందిన రామేశ్వర్ ఒరాన్, బన్నా గుప్తాతో పాటు, జేఎంఎంకు చెందిన మిథిలేష్ కుమార్ ఠాకూర్, హఫీజుల్ హసన్, దీపక్ బిరువా, బేబీ దేవి, ఆర్జేడీకి చెందిన సత్యానంద్ భోక్తా తమ మంత్రి పదవులను నిలుపుకున్నారు.

మరోవైపు సోమవారం ఉదయం అసెంబ్లీలో విశ్వాస పరీక్షను హేమంత్ సోరెన్ ప్రభుత్వం నెగ్గింది. అయితే ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

## తెలంగాణ వివిధ కార్పొరేషన్లకు నూతన చైర్మన్ల నియామకం

హైదరాబాద్ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పలు కార్పొరేషన్ల చైర్మన్ల నియామకంపై ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. 35 మంది చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం జివొ విడుదల చేసింది. రెండో రోజుల్లో కార్పొరేషన్ చైర్మన్లు బాధ్యతలు చేపట్టనున్నారు. మార్చి 15నే జివోలను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. కానీ పార్లమెంట్ కోడ్ ఉన్న నేపథ్యంలో ఇవాళ తిరిగి విడుదల చేశారు.

మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్: శోభారాణి

వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్: ఎం వీరయ్య

విత్తనాభివృద్ధి చైర్మన్: అన్వేష్ రెడ్డి

ఆగ్రో పరిశ్రమల అభివృద్ధి సంస్థ: కాసుల బాలరాజు

సంగీత నాట్య అకడామీ చైర్‌పర్సన్: అలేఖ్య పుంజాల

ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్: జైపాల్

ఆయిల సిడ్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్: జంగా రాఘవరెడ్డి

బిసి కార్పొరేషన్ చైర్మన్: నూతి శ్రీకాంత్

ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్: ఎన్ ప్రీతం

ఎస్‌టి కార్పొరేషన్ చైర్మన్: బెల్లయ్య నాయక్

గిరిజన కార్పొరేషన్ చైర్మన్: కె తిరుపతి

మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్: ఎంఎ జబ్బార్

రాష్ట్ర సహకార సంఘం చైర్మన్: మానాల మోహన్‌రెడ్డి

గిడ్డంగుల సంస్థ చైర్మన్: నాగేశ్వర్ రావు

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్: జ్ఞానేశ్వర్ ముదిరాజ్

మత్స్యసహకార సమాఖ్య చైర్మన్: మెట్టు సాయికుమార్

గ్రంథాలయ పరిషత్ చైర్మన్-రియాజ్

అటవీ అభివృద్ధి చైర్మన్: పొదెం వీరయ్య

ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్: కాల్వ సుజాత

పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్: గురునాథ్ రెడ్డి

సెట్ విన్ చైర్మన్: గిరిధర్ రెడ్డి

హస్త కళల అభివృద్ధి చైర్మన్: నాయుడు సత్యనారాయణ

ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్: అనిల్

టిజిఐఐసి చైర్‌పర్సన్: నిర్మలా జగ్గారెడ్డి

వాణిజ్య ప్రోత్సాహక కార్పొరేషన్ చైర్‌పర్సన్: ప్రకాశ్ రెడ్డి

సాంకేతిక సేవల అభివృద్ధి సంస్థ చైర్మన్: మన్నె సతీష్ కుమార్

పట్టణ ఆర్థిక మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్: చల్లా నరసింహారెడ్డి

శాతవాహన పట్టాణాభివృద్ధి సంస్థ చైర్మన్: కె నరేందర్ రెడ్డి

కాకతీయ పట్టాణాభివృద్ధి చైర్మన్: ఇ వెంకటరామిరెడ్డి

రహదారి అభివృద్ధి సంస్థ చైర్మన్: మల్‌రెడ్డి రంగారెడ్డి

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్: పటేల్ రమేశ్ రెడ్డి

తెలంగాణ ఫుడ్స్ చైర్మన్: ఎంఎ ఫహీమ్

## వై.ఎస్.ఆర్. సామాజిక న్యాయ స్ఫూర్తి ప్రధాత

**-75వ జయంతి సందర్భంగా వై.ఎస్.ఆర్. విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించిన డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు**



హైదరాబాద్ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); పేదలకు కార్పొరేట్ విద్య, వైద్యం, అనేక సంక్షేమ పథకాలను అందుబాటు లోకి తెచ్చిన సమ సమాజ దార్శనికుడు దివంగత వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం నాడు పంజాగుట్ట సర్కిల్ లోని వై.ఎస్.ఆర్. విగ్రహం వద్ద పూల మాల సమర్పించి డాఎఎ వకుళాభరణం ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా డాఎఎ వై.ఎస్.ఆర్. తో తనకున్న అనుబంధాన్ని ఆయన విలేకరుల ముందు ప్రస్తావించారు. 2004 వ సంఎఎ లో వై.ఎస్.ఆర్. తనను తొలిసారిగా బీసీ కమిషన్ సభ్యుడిగా నియమించారని, 2009 సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 'బీ' ఫారం ఇచ్చి హుజూరాబాద్ (కరీంనగర్ జిల్లా) నుండి శాసన సభకు పోటీ చేసే అవకాశం కల్పించారని డాఎఎ వకుళాభరణం గుర్తు చేసుకున్నారు. ఒక సామాన్య కుటుంబంకు చెందిన తనను ఉన్నతంగా ఎదగడానికి డాఎఎ వై.ఎస్.ఆర్. ప్రోత్సహించిన తీరు ఎన్నటికీ మరువలేనిది అన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే, తనకు రాజకీయ జన్మను ఇచ్చిన మహానేత గా ఎప్పటికీ గుర్తుండి పోయే అనుబంధం వై.ఎస్.ఆర్. తో తనకు ఉందని, అది ఎప్పటికీ విడదీయరానిది అన్నారు.ఆరోగ్యశ్రీ,, బోధనా రుసుము పథకం, వందలాది కాలేజీ స్థాయి బీసీ హాస్టళ్ళు, పోషక విలువలతో కూడిన సంక్షేమ హాస్టళ్ళలో పౌష్టికరమైన ఆహారం, ఇలా ఎన్నో పథకాలను అమల్లోకి తెచ్చి, సంక్షేమ రాజ్య స్థాపకుడిగా ప్రజల హృదయాలతో చెరగని సుస్థిర స్థానం సంపాదించుకున్న మహా నేత డాఎఎ వై.ఎన్.ఆర్. అని ఆయన కొనియాడారు.

**నేటి కందం- నేటికీ అందం**


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం


శ్రేయమ్మును గోరుచు-నాం
గ్లేయుల కాలమ్ము నందె కీర్తింపబడన్
బీయస్యీ తెరువబడియె
ధ్యేయముగల నిర్వహణను తెలుప ప్రజలకున్
(9-7-1875 బాంబే స్టాక్ ఎక్స్ ఛేంజ్ ప్రారంభం)



-రాధశ్రీ
సెల్:9494481210

## డీఎస్సీ పరీక్షలు యధాతథం.. అభ్యర్థుల నిరసనకు తలొగ్గని ప్రభుత్వం

హైదరాబాద్, జులై 8 :డీఎస్సీ పరీక్షలు యధాతథంగా జరుగుతాయని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డిఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అభ్యర్థులు ఈ నెల 11న సాయంత్రం 5 గంటల నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవవచ్చని పేర్కొంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

కాగా, డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని గత కొన్ని రోజులుగా అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. టెట్ పరీక్ష నిర్వహించి ఆ వెంటనే డీఎస్సీ నిర్వహిస్తున్నారని, రెండు పరీక్షల సిలబస్ వేర్వేరు కాబట్టి డీఎస్సీ ప్రిపరేషన్‌కు సమయం కావాలని వారు కోరుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన కనిపించకపోవడంతో అభ్యర్థులు సోమవారం విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టిడించారు.

అయితే అభ్యర్థుల అందోళనను ప్రభుత్వం లెక్కచేయలేదు. డీఎస్సీ పరీక్షల వాయిదాకు అంగీకరించలేదు. యథాతథంగా ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహించేందుకు మొగ్గుచూపింది. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. దాంతో డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన అరణ్య రోదనే అయ్యింది.

## ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా మెట్టు సాయి కుమార్ బాధ్యతల స్వీకరణ...

హైదరాబాద్ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సోమవారం సాయంత్రం మత్స్య భవన్లో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ గా మెట్టు సాయి కుమార్ బాధ్యతల స్వీకరించారు. శాస్త్రయుక్తంగా వేద పండితుల ఆశీర్వాదాలతో బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక అలా, సీనియర్ కాంగ్రెస్ నేతలువి హనుమంతరావు, ఫిరోజ్ ఖాన్, అభిమానులు, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలను బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తా... మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా... నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ కార్యకర్తలకు రుణపడి ఉంటా నన్నారు. సామాన్య కార్యకర్త నుండి ఈ స్థాయికి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు... గతంలో అనేసిక సమస్యలు పరిష్కారం కాలేదు... సమస్యల పరిష్కరించడమే నా ఎజెండా గగా ముస్ముకువెల్తానన్నారు.

# ఉచిత పథకాల లక్ష్యాలు నెరవేరుతున్నాయా?!

01 జులై 2024న ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం రూ:2,000 కోట్లు కేటాయించి అర్హులైన 18 ఏండ్లు దాటిన మహిళలకు ఒక్కొక్కరికి నెలకు రూ: 1,000/- చొప్పున 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన పథకం' కింద ప్రతి ఉచితంగా పంపిణీ చేయడానికి నిర్ణయం తీసుకుంది. ఇలాంటి మరెన్నో ఉచిత పథకాలను వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రకటించడం, నానాయాతనపడుతూ అమలు పరచడం జరుగుతోంది. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఉచిత పథకాలను బడుగు బలహీన వర్గాలకు పంపిణీ చేయడం సముచితంగానే ఉన్నదని ఆర్‌బిఐ కూడా పేర్కొనడం విశేషం. స్వల్పకాల ప్రయోజనాలను కలిపించే ఉచిత పథకాల అమలు ద్వారా సాంఘీక న్యాయం, సమానత్వం, మానవ అభివృద్ధి లాంటివి మెరుగుపడతాయని విశ్లేషించబడింది.

## ఉచిత పథకాలతో ప్రయోజనాలు:

ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధి హామీ, మధ్యాహ్న భోజనం, లాంటి పథకాలతో బలహీన వర్గాల ఆర్థిక ప్రగతి మెరుగుపడి శ్రమజీవుల శక్తిసామర్థ్యాలు పెరిగి మరింత శ్రమ దానం చేయడానికి దోహదపడుతున్నాయి. అల్పాదాయ పాఠశాల విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తువుల పంపిణీ, పుస్తకాల పంపిణీ, సైకిల్స్ వితరణ, ఆరోగ్య భీమా లాంటివి అక్షరాస్యత, రవాణా, ఆరోగ్యం, జీవన నాణ్యత, ఉన్నత విద్య నవోదు లాంటివి పెరగడానికి దోహదపడుతున్నట్లు తెలుస్తున్నది. ఈ ఉచిత పథకాల అమలుతో వస్తు/సేవా రంగాలకు ఊతం ఇవ్వడం, ఆర్థిక వెసులుబాటు పెరగడం, అసమానతలు తగ్గడం జరుగుతున్నది. రుణ మాఫీ, రైతు భరోసా లాంటి తెలంగాణ రాష్ట్ర ఉచిత పథకాల అమలుతో పేద కుటుంబాల రుణ భారం తగ్గడం, మరోసారి రుణాలకు అర్హత పొందడం, ఆదాయం పెరగడం లాంటి వాంఛనీయ మార్పులు జరుగుతాయి.

## ఉచిత పథకాల అమలుతో ప్రతికూలతలు:

ప్రభుత్వాల ఉచిత పథకాల కత్తికి రెండు వైపుల పదును ఉండడం చూస్తున్నాం. అసంబద్ధ ఉచిత పథకాల అమలుతో ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ కుంటుపడడం, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు పలుచబడడం జరుగుతున్నది. ఇలాంటి ఉచిత పథకాలతో ద్రవ్యోల్బణం పెరగడంతో వ్యవసాయం, మౌలిక వసతులు, పరిశ్రమలు లాంటి ప్రధాన ప్రభుత్వ శాఖలకు నిధుల కేటాయింపు క్షీణించడం చూస్తున్నాం. ఉచిత నీటి పంపిణీ, ఉచిత విద్యుత్తు సరఫరా లాంటి సంక్షేమ పథకాల అమలుతో వాటిని దుర్వినియోగం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు భంగం కలుగుతున్నది. ఉచిత పథకాల అమలుతో పని సంస్కృతి తగ్గడం, పరాన్నజీవుల వలె ప్రభుత్వ పథకాల మీద ఆధారపడడం, వర్క్ ఫోర్స్ పరిమితం అవుతూ ఉత్పత్తులు తగ్గడం లాంటి ప్రతికూల ఫలితాలు కూడా కలుగుతాయని తెలుస్తున్నది. ఉచిత నగదు బదిలీ పథకాలతో బలహీన వర్గాలు ఆల్కహాల్/మత్తు మందుల దురలవాటు బారిన పడడం, కల్తీ ఉత్పత్తులతో ఆరోగ్యాలు చెడిపోవడం, శ్రమ చేసే చేతులు బలహీన పడడం, జూదం పట్ల ఆకర్షితులు కావడం లాంటివి జరిగి లక్ష్యాలకు దూరంగా ప్రతికూల ఫలితాలను కూడా ఇవ్వడం చూస్తున్నాం.

ఉచిత పథకాల అమలుతో సత్వర సామాజిక, ఆర్థిక సవాళ్ళు అధిగమించినా వాటి దీర్ఘకాల అమలుతో ప్రభుత్వాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. సరైన అర్హులను గుర్తించడం, అత్యవసర ఉచిత పథకాలను అమలు చేయడం, అర్హులు కాని ప్రజలను గుర్తించి ఏరి వేయడం, పటిష్ట పథకాల అమలుకు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రభుత్వాలు సంక్షేమ, సమగ్రాభివృద్ధి పథకాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం జరగాలి. ప్రజలకు సంపాదించుకోవడానికి సరైన పనిని, శ్రమకు తగిన వేతనం లేదా జీతాలను ఇవ్వడం, అర్హతలకు తగిన ఉద్యోగ ఉపాధులు కల్పించడం లాంటి సూత్రాలను తప్పనిసరిగా పాటించాలి. సంక్షేమ ఉచిత పథకాలకు, అభివృద్ధికి సమతుల్యత పాటిస్తే అసమానతలు తగ్గి సంపూర్ణ ఆరోగ్య భారతం సాక్షాత్కరిస్తుందని తెలుసుకోవాలి.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ప్రపంచ జూనోసిస్ దినోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.




సంగారెడ్డి, జులై 8:(నేటినిజం ప్రతినిధి):జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రపంచ జూనోసిస్ దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తమ పెంపుడు జంతువులకు యాన్టీ రాబిస్ వాక్సిన్ ను తప్పనిసరిగా వేయించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు .

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1885 సంవత్సరంలో జులై 6 వ తేదీన లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొట్టమొదటి సారిగా పిచ్చికుక్క కాటుకు ఇచ్చిన వ్యాక్సిన్ విజయవంతం అయిన రోజని , దానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జులై 6 వ తేదీన జూనోసిస్ దినోత్సవం గా నిర్వహిస్తుంటామని తెలిపారు. సంగారెడ్డి పట్టణంలో దాదాపు 1000 కుటుంబాలు పెంపుడు కుక్కలను పెంచుకుంటున్నాయని,వీరందరూ తమ పెంపుడు కుక్కల కు యాన్టీ రాబిస్ వాక్సిన్ ను వేయించాలన్నారు. పెంపుడు కుక్కలకు జిల్లా కలెక్టర్ యాన్టీ రాబిస్ వాక్సిన్ వేశారు.

గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 50,000 మందికి జంతువుల నుండి సక్రమించే వ్యాధుల ద్వారా మృత్యువాత పడుతున్నా రన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మనిషి ఏదో ఒక విధంగా జూనోటిక్ వ్యాధికి గురవుతన్నాడని పేర్కొన్నారు . జంతు సంక్రమిత వ్యాదులనివారణకు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అన్నారు . ఇంట్లో పెంచుకుంటున్న కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు పశువైద్య కేంద్రాలలో ఇవ్వడం జరుగుతుం దని తెలిపారు. పెంపుడు జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన యొక్క ప్రాముఖ్యతను తెలియజేసారు. జిల్లాలోని కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ ( ఎ బి సి) చేయిస్తున్నామని ,వాటి సంఖ్య ను నియంత్రించడానికి 100% ఫెర్టిలైజేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

వీధి కుక్కలు ఆహారం కోసం రోడ్లపై తిరగడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని,ఇంట్లో ఉన్న చెత్తను బయట రోడ్లపై పడేయకుండా చెత్తను సేకరించే మున్సిపల్ వాహనాలకే వేయాలని సూచించారు. చెత్తను సేకరించే వాహనాలు ఇంటింటి కి తిరిగి చెత్తను సేకరించే లా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు . బస్తీ, పట్టణ సంక్షేమ సంఘాల భాగస్వామ్యం తో వీధి కుక్కలకు త్రాగు నీరు,ఆహారం అందించి, వాటిని దత్తత దీసుకునేటి వంటి చర్యలు పరిశీలించాలని మున్సిపల్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సంగారెడ్డి పశు వైద్యకేంద్రంలోని ఏ డి డి ఎల్ ల్యాబ్‌ని పరిశీలించారు , ల్యాబ్‌లో చేపట్టిన కార్యక్రమాల గురించి వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రవీంధర్ , సిబ్బంది పాల్గొన్నారు

# శ్రీ కీర్ స్టార్మర్‌తో సంభాషించిన ప్రధాన మంత్రి; యుకె ప్రధాని గా ఎన్నికైనందుకు శ్రీ కీర్ స్టార్మర్ కు అభినందనలను తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 8 :యునైటెడ్ కింగ్ డమ్ ప్రధాని రైట్ ఆనరబుల్ శ్రీ కీర్ స్టార్మర్ తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజున మాట్లాడారు.

యుకె కు ప్రధానిగా పదవీబాధ్యతలను స్వీకరించిన సందర్భంగా ఆయనకు, ఎన్నికలలో అసాధారణ మైన గెలుపును సాధించిన లేబర్ పార్టీకి అభినందనలను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు.

రెండు దేశాల మధ్య గల చరిత్రాత్మక సంబంధాలను నేతలు ఇరువురు గుర్తుకు తెచ్చుకొన్నారు. భారతదేశానికి, యుకెకు మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తృతపరచడం తో పాటు ముందుకు తీసుకుపోవాలన్న వారి నిబద్ధతను వారు పునరుద్ఘాటించారు. భారతదేశం-యుకె స్వేచ్ఛా వ్యాపార ఒప్పందాన్ని ఉభయ పక్షాలకు ప్రయోజనకరం గా ఉండే విధంగా త్వరగా కొలిక్కి తీసుకు వచ్చే దిశ లో కృషి చేద్దామంటూ నేతలు ఇద్దరూ వారి అంగీకారాన్ని వ్యక్తం చేశారు.

యుకె లో సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కై భారతీయ సముదాయం అందిస్తున్నటువంటి సకారాత్మకమైన తోడ్పాటులను ప్రశంసిస్తూ, ఇరు పక్షాలు ప్రజల మధ్య పరస్పర సంబంధాలను ప్రోత్సహించడాన్ని ఇకమీదట కూడా కొనసాగించడానికి సమ్మతి ని తెలిపాయి.

భారతదేశాన్ని సందర్శించేందుకు వీలయినంత త్వరలో బయలుదేరి రావాలంటూ ప్రధాని శ్రీ కీర్ స్టార్మర్ ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆహ్వానించారు.

ఇద్దరు నేతలు ఒకరితో మరొకరు సంప్రదింపులు జరుపుకొంటూ ఉండడాన్ని ఇకవిూదట కూడా కొనసాగించాలని అంగీకరించారు.

# కృష్ణా-గోదావరి నదుల సంగమం-మంత్రి నిమ్మల జలహారతి



అమరావతి, జులై 8 : ముఖ్యమంత్రి చంద్రబాబు దీక్షాదక్షతకు, పట్టుదలకు చిహ్నమే పట్టిసీమ ప్రాజెక్టు అని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమంలో పట్టిసీమ నుంచి వస్తున్న గోదావరి జలాలకు సోమవారం ఆయన విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాద్ తో కలిసి హారతి ఇచ్చి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? కృష్ణా డెల్టా దిగువ భాగాన ప్రజలు, రైతులకు అవసరమైన తాగు, సాగునీటి కష్టాలు తీర్చడానికి చంద్రబాబు కష్టానికి ఫలితమే కృష్ణా, గోదావరి పవిత్ర సంగమం అని చెప్పారు. పట్టిసీమను వట్టిసీమ అని విమర్శించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పంటల సంగతి దేవుడెరుగు కనీసం తాగటానికి నీళ్లివ్వండని మొరపెట్టుకున్నా.. గత ప్రభుత్వం కనికరించలేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో తాగు, సాగు నీటిని అందించడం ద్వారా ప్రజలు, రైతుల కష్టాలను తీరుస్తామని భరోసా ఇచ్చారు.

ప్రతి సంవత్సరం సముద్రంలో వృథాగా కలుస్తున్న మూడు వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సఫలీకృతం చేశారని తెలిపారు. భారతదేశంలోనే రెండు నదులను ఏకం చేసిన నాయకుడు చంద్రబాబు అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తెదేపా నేతలు ఎమ్మెస్ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

# దేశ గతిశీల సాంస్కృతిక నిర్మాణానికి దోహదపడే సంభాషణగా, ప్రతిబింబంగా, స్ఫూర్తిని ప్రేరేపించడం ప్రాజెక్ట్ 'పారి' లక్ష్యం

న్యూఢిల్లీ, జులై 8 :భారతదేశం చాలా కాలంగా కళాత్మక వ్యక్తీకరణకు శక్తివంతమైన కేంద్రంగా ఉంది, దాని గొప్ప పబ్లిక్ ఆర్ట్ దేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. పురాతన గుహాలయాలు, సంక్లిష్టమైన కుడ్యచిత్రాల నుండి గ్రాండ్ పబ్లిక్ శిల్పాలు, శక్తివంతమైన వీధి కళల వరకు, భారత్ ప్రకృతి దృశ్యాలు ఎల్లప్పుడూ కళాత్మక అద్భుతాలతో అలంకరించుకుంది. చారిత్రాత్మకంగా, కళ రోజువారీ జీవితం, మతపరమైన పద్ధతులు, సామాజిక ఆచారాలతో లోతుగా ముడిపడి, నృత్యం, సంగీతం, థియేటర్, దృశ్య కళల వంటి వివిధ పద్ధతుల ద్వారా వ్యక్తమవుతుంది.

ప్రాజెక్ట్ పారి (పబ్లిక్ ఆర్ట్ ఆఫ్ ఇండియా) అనేది లలిత కళా అకాడమీ, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ చొరవ. సహస్రాబ్దాల కళాత్మక వారసత్వం (లోక్ కళా/లోక్ సంస్కృతి) నుండి ప్రేరణ పొందే ప్రజా కళను ఆధునిక ఇతివృత్తాలు, సాంకేతికతలను కలుపుతూ ముందుకు తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది. ఈ వ్యక్తీకరణలు భారతీయ సమాజంలో కళకు ఉన్న అంతర్గత విలువను నొక్కి చెబుతాయి, సృజనాత్మకత, కళాత్మక వ్యక్తీకరణ పట్ల దేశం శాశ్వత నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ప్రాజెక్ట్ పారి కింద మొదటి కార్యక్రమం ఢిల్లీలో జరుగుతోంది. ఇది 21-31 జులై 2024 మధ్య కొత్త ఢిల్లీలో జరగనున్న వరల్డ్ హెరిటేజ్ కమిటీ 46వ సెషన్‌తో సమానంగా ఉంటుంది.

బహిరంగ ప్రదేశాలలో కళ చాలా ముఖ్యమైనది, ఇది దేశ గొప్ప, విభిన్న సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. వివిధ ప్రదేశాలలో ఉండే కళల ద్వారా ప్రజాస్వామ్యీకరణ పట్టణ ప్రకృతి దృశ్యాలను అందుబాటులో ఉండే గ్యాలరీలుగా మారుస్తుంది. ఇక్కడ కళ మ్యూజియంలు, గ్యాలరీల వంటి సాంప్రదాయ వేదికల పరిమితులను అధిగమించింది. వీధులు, ఉద్యానవనాలు, రవాణా కేంద్రాలలో కళను ఏకీకృతం చేయడం ద్వారా, ఈ కార్యక్రమాలు కళాత్మక అనుభవాలు అందరికీ అందుబాటులో ఉండేలా చూస్తాయి. ఈ కలుపుకొని ఉన్న విధానం భాగస్వామ్య సాంస్కృతిక గుర్తింపును పెంపొందిస్తుంది. సామాజిక ఐక్యతను పెంచుతుంది, పౌరులను వారి రోజువారీ జీవితంలో కళతో నిమగ్నమవ్వడానికి ఆహ్వానిస్తుంది. ప్రాజెక్ట్ పారి దేశ గతిశీల సాంస్కృతిక నిర్మాణానికి దోహదపడే సంభాషణగా, ప్రతిబింబంగా, స్ఫూర్తిని ప్రేరేపించడం లక్ష్యంగా నిలుస్తుంది.

ఈ ప్రాజెక్ట్ కింద సిద్ధమవుతున్న వివిధ వాల్ పెయింటింగ్‌లు, కుడ్యచిత్రాలు, శిల్పాలు, ఇన్‌స్టాలేషన్‌లను రూపొందించడానికి దేశం నలుమూలల నుండి 150 మందికి పైగా దృశ్య కళాకారులు ఒకే వేదికపైకి వచ్చారు. సృజనాత్మక కాన్వాస్‌లో ఫాడ్ పెయింటింగ్స్ (రాజస్థాన్), థంగ్కా పెయింటింగ్ (సిక్కిం/లడఖ్), మినియేచర్ పెయింటింగ్ (హిమాచల్ ప్రదేశ్), గోండ్ ఆర్ట్ (మధ్యప్రదేశ్), తంజోర్ పెయింటింగ్‌ల ద్వారా ప్రేరణ పొందిన మరియు/లేదా గీసిన కళాకృతులు ఉన్నాయి. తమిళనాడు), కలంకారి (ఆంధ్రప్రదేశ్), అల్పోనా ఆర్ట్ (పశ్చిమ బెంగాల్), చెరియాల్ పెయింటింగ్ (తెలంగాణ), పిచ్వాయ్ పెయింటింగ్ (రాజస్థాన్), లంజియా సౌరా (ఒడిశా), పట్టచిత్ర (పశ్చిమ బెంగాల్), బని థాని పెయింటింగ్ (రాజస్థాన్), వార్లీ ( మహారాష్ట్ర), పిథోరా ఆర్ట్ (గుజరాత్), ఐపాన్ (ఉత్తరాఖండ్), కేరళ కుడ్యచిత్రాలు (కేరళ), అల్పనా ఆర్ట్ (త్రిపుర) ఇంకా మరిన్ని కలలతో ముందుకు వచ్చారు.

ప్రాజెక్ట్ పారి కోసం రూపొందిస్తున్న ప్రతిపాదిత శిల్పాలలో ప్రకృతికి నివాళులు అర్పించడమే కాకుండా విస్తృత ఆలోచనలు, నాట్యశాస్త్రం, గాంధీజీ, భారతదేశపు బొమ్మలు, ఆతిథ్యం, పురాతన జ్ఞానం, నాద్ లేదా ప్రాచీన సౌన్, జీవిత సామరస్య స్ఫూర్తితో కూడిన ఆలోచనలు, కల్పతరు ? దివ్య వృక్షం మొదలైనవి ఉన్నాయి.

# భారతదేశంలోని 50 నగరాల్లోని 71 కేంద్రాల్లో 35,819 మంది అభ్యర్థుల కోసం ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ పరీక్షను నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్

న్యూఢిల్లీ, జులై 8 :కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన స్వయంప్రతిపత్తి సంస్థ, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) 35,819 మంది అభ్యర్థులకు ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ పరీక్షను (ఎఫ్ఎంజీఈ) నిర్వహిం చింది.

21 రాష్ట్రాల్లోని, 50 నగరాలలో 71 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. పరీక్ష భద్రతను కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా ఎన్‌బీఈఎంఎస్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 250 మంది అబ్జర్వర్లను నియమించింది. 45 మంది అధ్యాపకులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసింది.

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్), కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, ఇతర సంస్థలు కూడా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఒక ఉన్నతాధికారిని నియమించాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని, ఎన్‌బీఈఎంఎస్ నేడు నిర్వహించిన ఎఫ్ఎంజీఈ ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిపింది.

# సీబీఎన్ మార్క్! తిరుమలలో ప్రక్షాళన షురూ..

## దళారుల భరతం పడుతున్న అధికారులు

- కీలక వ్యవస్థల మార్పులకు శ్రీకారం
- భక్తులకు సేవలపైనే దృష్టి
- దళారులకు ఉక్కపోత
- నిర్లక్ష్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు, మెమోల జారీ
- డెప్యుటేషన్బాబులువెనక్కి
- చర్యల్లో ఎక్కడా తగ్గని టీటీడీ ఈవో

తిరుపతి, జులై 8 : ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశకత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానాల (టి టి డి ) ప్రక్షాళన కార్యక్రమం ఊపందుకుంటోంది. టీటీడీ కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు అంశాలవారీగా లోటుపాట్లను సరిదిద్దడం మొదలు పెట్టారు. తిరుమలకు వచ్చే యాత్రీకుల అవసరాలు లక్ష్యంగా పలు వ్యవస్థలలో మార్పు చేర్పులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పలువురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు, మెమోలు జారీ చేయడమే కాక కొందరు డెప్యూటేషన్ అధికారులను మాతృ సంస్థకు పంపించే కార్యక్రమాన్నీ కూడా ప్రారంభించారు.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించిన వెంటనే తిరుమలేశుని దర్శించుకోడానికి గత నెలలో తిరుమలకు వచ్చిన చంద్రబాబు ఇక్కడినుంచే ప్రక్షాళన మొదలు పెడుతున్నట్టు ప్రకటించారు. ఆ క్రమంలోనే సీనియర్ ఐ ఏ ఎస్ అధికారి శ్యామలరావు ను టీటీడీ కార్యనిర్వహణాధికారిగా నియమించారు. విధుల్లో చేరిన వెంటనే విస్తృతంగా పర్యటనలు మొదలు పెట్టిన శ్యామల రావు ముఖ్యమంత్రి చెప్పిన ప్రక్షాళన కార్యక్రమాన్ని మొదలు పెట్టారు.

### భక్తులకు సేవలపైనే ఫోకస్

ముఖ్యంగా రద్దీ సమయాల్లో కిలోమీటర్ల కొద్దీ ఉన్న క్యూ లైన్లలో వేచి వుండే భక్తులను నామమాత్రంగా అందుతున్న అన్న ప్రసాదాలు, పాలు వంటి వాటిపై దృష్టి సారించారు. క్యూలైనులలో వేచివుండే భక్తులకు నిరంతరాయంగా నీళ్లు, పాలు, అన్న ప్రసాదాలు అందించాలని ఆదేశాలను జారీ చేశారు. అదేవిధంగా పారిశుధ్యం విషయంలో తనిఖీలు జరిపి తగు ఆదేశాలు జారీ చేసి చక్కదిద్దే చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో విధినిర్వహణకు సంబంధించి పలువురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు, మెమోలు కూడా జారీ చేశారు. దర్శనం పరమైన సమస్యలను గుర్తించిన శ్యామల రావు శ్రీవారి మెట్టు మార్గం గుండా వచ్చే వారికి దివ్య దర్శనం టోకెన్లు ఇచ్చే ప్రక్రియను పునః ప్రారంభించారు.

డెప్యూటేషన్లపై .. గరం గరం

తిరుమలలో పెచ్చుమీరిపోతున్న దళారీలపై దృష్టి సారించి టీటీడీ విజిలెన్సు, పోలీసుల సమన్వయంతో అరికట్టే చర్యలను మొదలు పెట్టారు. ఇటీవలి కాలంలో తిరుమలేశుని దివ్య ప్రసాదం లడ్డూల విషయంలో వస్తున్న నాణ్యతా పరమైన అంశాలను చక్కదిద్దడానికి అటు వస్తువులను సరఫరా చేసే వ్యాపారులతో, ఇటు లడ్డూలను తయారు చేసే బ్రాహ్మణులతో సమావేశాలు నిర్వహించి లోపాలను సరిద్దిద్దడం ప్రారంభించారు. అన్నిటినిమించి ప్రభుత్వం నుంచి టీటీడీ కి డెప్యూటేషన్ పై వచ్చిన అధికారుల పనితీరు పై దృష్టి ని సారించిన శ్యామల రావు అవసరాన్ని బట్టి కొనసాగించాలా వద్దా అనే అంశంపై చర్యలు మొదలు పెట్టారు.

తాజాగా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా ) వైస్ చైర్మన్ గా పని చేస్తూ కొన్ని నెలల కిందటే టీటీడీకి డెప్యూటేషన్ పై వచ్చిన హరికృష్ణ ను వెనక్కు పంపించివేశారు. మరి కొందరిని కూడా పంపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంమీద పలు కారణాలవల్ల గత కొంతకాలంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యవస్థలను, విభాగాలను చక్కదిద్దడం ద్వారా చంద్రబాబు నిర్దేశకత్వంలో టీ టీ డి ప్రక్షాళన ఊపందుకుంది.

### దళారీలకు ముక్కుతాడు

తిరుమలలో దళారుల ఆటకట్టించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. టీటీడీ విభాగం నుంచి గదులు పొంది అక్రమాలకు పాల్పడిన వారిపై నిఘా పెంచారు. దళారుల అక్రమాలపై 2019 నుంచి ఇప్పటివరకూ 279 కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసుల్లోని నిందుతుల వివరాలను ప్రకటించారు. నకిలీ ఆధార్‌లతో గదులు, సేవా టికెట్లు పొందిన 589 మందిని గుర్తించారు. వీరిలో 208 మందిని అరెస్ట్ చేశారు. మిగిలిన 381 మంది కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు సమర్పించిన నకిలీ ఆధార్ కార్డుల ఆధారంగా పట్టుకునేందుకు యత్నిస్తున్నారు.

కాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తిరుమల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో జరిగిన అవినీతి, అక్రమాలపై నిఘా పెట్టారు. చిన్న తప్పు దొరికినా వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో చాలా అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. దీంతో వారందరిపై చర్యలు తీసుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం.

# కెసిఆర్ పగటి కలలు మానాలి:పరికపల్లి శ్రీనివాస్



ఖమ్మం, జులై 8 :(నేటినిజం ప్రతినిధి): తొమ్మిదిన్నర సంవత్సరాల కాలం దురహంకార, అవినీతి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాత, రజాకార్ల వంటి కుటుంబ పాలన సాగించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నభిన్నం చేసి అప్పుల ఊబిలో దించి 2023 శాసనసభ ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై పదవి కోల్పోయిన కల్వకుంట్ల చంద్రశేఖరరావు వాస్తవాలను గుర్తించకుండా తిరిగి ఆరునెలల్లోనే ప్రజలు ఆశీర్వదించి ఎన్నుకున్న ప్రస్థుత రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందని అవాకులు, చివాకులు పేల్చుతూ ప్రగల్బాలు పలుకుతున్నారని జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. సోమవారం కొనిజర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థల కొమ్ము కాసీ పేదప్రజల విద్య, వైద్య రంగాలను విధ్వంసం చేసి గ్రామపంచాయితీలను భ్రష్టు పట్టించి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ప్రభుత్వ భూములను ఆక్రమించి, ప్రజాధనాన్ని దోచుకొని రాష్ట్రానికి ఏడు లక్షల 50వేల కోట్లరూపాయల అప్పు మిగిల్చి తిరిగి కోల్కోలేని విధంగా అప్పుల ఊబిలోదించి మళ్లీ తానే వస్తున్నానని ఉత్తర ప్రగల్భాలు పలకడంగా ఉంది. దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నిటికీ తానే ఎన్నికల ఖర్చు పెడతానని చెప్పుకునే స్థాయికి దోచుకొని, దాచుకొని మళ్లీ రాష్ట్రంలో నేనే వస్తానని చెప్పుకోవడానికి కల్వకుంట చంద్రశేఖరరావుకు ఎలాంటి అర్హత లేదని, తెలంగాణ ప్రజలు ఓటు ద్వారా రెండుసార్లు జ్ఞానోదయం కలిగే విధంగా బుద్ధి చెప్పినప్పటికీ మతిభ్రమించి మార్పు రాకపోవడం విచారకరమని ఆందోళన చెందారు. అవినీతి మాత్రమే లక్ష్యంగా లక్ష కోట్లతో నిర్మించిన కాలేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది, విద్యుత్ ప్రాజెక్టులు నిరర్థకమైనాయి. గొర్ల కొనుగోలు వ్యవహారంలో 700 కోట్ల రూపాయల స్కాంకు పాల్పడి గొల్ల కురుమలకు తీవ్ర అన్యాయం చేసిన అవినీతి పాలకుడని ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి తీహార్ జైలుకు పోవడానికి సిద్ధమైన పరిస్థితులలో ఇంకా ప్రజలను మభ్యపెట్టే పద్ధతిలో మాట్లాడితే నమ్మేవారు లేరని దుయ్యబట్టారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్న పత్రాలను వీధిలో అమ్మి లక్షల మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేసిన కేసీఆర్ కు మాట్లాడే హక్కు ఉందా అని ప్రశ్నించారు. ? 2023 శాసనసభ ఎన్నికల్లో ఓడిపోవడమే కాకుండా ఇటీవల లోకసభ ఎన్నికల్లో భారాసకు అనేక స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కని విషయాన్ని గుర్తు పెట్టుకొని మాట్లాడితే తెలంగాణ ప్రజలు శాంతిస్తారని ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కల్వకుంట్ల కుటుంబానికి తెలంగాణ ప్రజాస్వామ్యం లో ఇక స్థానం లేదని హెచ్చరించారు.

# ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు

## - అక్రమ నిర్మాణాలను కూల్చి వేసిన అధికారులు

రంగారెడ్డి: జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలో అక్రమ నిర్మాణాల పై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. కబ్జా కోరులు కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. హిమాయత్ సాగర్ సర్వే నెంబర్ 37 లో గల 1000 గజాల స్థలంతో పాటు కిస్మత్ పూర్ సర్వే నెంబర్ 132 లో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. సోమవారం తెల్లవారుజామున జెసిబిల సహాయంతో నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు.

# అసాంక్రమిత వ్యాధుల పెరుగుదలను ఎదుర్కోవడానికి, ప్రజారోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించేందుకు కూడా ఇది దోహదం చేస్తుంది

న్యూఢిల్లీ, జులై 8 :ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై పోషక సమాచారంలో మొత్తం చక్కెర స్థాయి, ఉప్పు, సంతృప్త కొవ్వుకు సంబంధించి బోల్డ్, పెద్ద అక్షరాలలో ముద్రణకు పెద్ద పరిమాణాన్ని ప్రదర్శించే ప్రతిపాదనకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) ఆమోదం తెలిపింది.

ఎఫ్ఎస్ఎస్ఏఐ అధ్యక్షుడు శ్రీ అపూర్వ చంద్ర నేతృత్వంలో జరిగిన ఫుడ్ అథారిటీ 44వ సమావేశంలో పౌష్టికాహార సమాచార లేబులింగ్ సంబంధించి ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ (లేబులింగ్, డిస్ప్లే) రెగ్యులేషన్స్, 2020 సవరణను ఆమోదించాలని నిర్ణయం తీసుకున్నారు. వినియోగదారులు తాము వినియోగించే ఉత్పత్తుల పోషక విలువలను సమర్థవంతంగా అర్థం చేసుకోవడానికి, ఆరోగ్యకరమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సవరణ లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సవరణకు సంబంధించిన ముసాయిదా నోటిఫికేషన్ ను సలహాలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు.

ఒక వడ్డింపు (పర్ సర్వ్) శాతానికి, రికమండెట్ డైటరీ అలవెన్సెస్ (సిఫార్సు చేయబడిన ఆహార మొత్తాలు) (ఆర్డిఎ) సంబంధించిన సమాచారంలో మొత్తం చక్కెర, మొత్తం సంతృప్త కొవ్వు, సోడియం స్థాయి పెద్ద అక్షరాలలో ఇవ్వబడుతుంది. ఎఫ్ఎస్ఎస్ (లేబులింగ్, డిస్ప్లే) రెగ్యులేషన్, 2020 లో పొందుపర్చిన రెగ్యులేషన్ 2 (వి), 5 (3) వరుసగా ఆహార ఉత్పత్తుల లేబుళ్లపై వడ్డించే పరిమాణం, పోషక సమాచారాన్ని పేర్కొనాల్సిన ఆవశ్యకతలను నిర్దేశిస్తాయి.

వినియోగదారులు తాము ఆరోగ్యకరమైన ఆహారాలను ఎంపిక చేసుకునేందుకు సాధికారత కల్పించడంతో పాటు, అసాంక్రమిత వ్యాధుల(ఎన్సిడి) పెరుగుదలను ఎదుర్కునేందుకు, ప్రజారోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించే దిశగా ఈ సవరణ దోహదం చేస్తుంది. స్పష్టమైన, ప్రత్యేకమైన లేబులింగ్ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం అసాంక్రమిత వ్యాధులను ఎదుర్కోవటానికి చేస్తున్న ప్రపంచ దేశాల ప్రయత్నాలకు ఇది తోడ్పాటును అందిస్తుంది.

తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే క్లెయిము లను నిరోధించడానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తోంది. ఎఫ్ఎస్ఎస్ చట్టం 2006 లేదా దాని కింద చేసిన నియమ నిబంధనల ప్రకారం 'హెల్త్ డ్రింక్' అనే పదాన్ని ఎక్కడా నిర్వచించనందున లేదా ప్రామాణీకరించనందున తొలగించాలని ఈ-కామర్స్ వెబ్‌సైట్లకు సలహాలు ఇస్తుంది. పునర్నిర్మించిన పండ్ల రసాల లేబుల్స్, ప్రకటనల నుండి '100% పండ్ల రసాల' క్లెయిమ్ ను తొలగించాలని అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులను (ఎఫ్బిఓలు) ఆదేశిస్తుంది. గోధుమ పిండి/ శుద్ధి చేసిన గోధుమ పిండి అనే పదాన్ని ఉపయోగించడం, ఓఆర్ఎస్ ల ప్రకటన, మార్కెటింగ్ తో పాటు, పూర్వపదం లేదా అనుబంధాన్ని చేర్చడం, బహుళ-మూల వంట నూనెల కోసం పోషక పనితీరు క్లెయిమ్ లు మొదలైనవి. ఆహార వ్యాపార నిర్వాహకులు తప్పుదోవ పట్టించే క్లెయిమ్లను నిరోధించడానికి ఈ సలహాలు, ఆదేశాలు జారీ చేస్తారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, వాణిజ్య మంత్రిత్వ శాఖ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన అధికారులు హాజరయ్యాయి. ఈ సమావేశంలో పారిశ్రామిక సంఘాలు, వినియోగదారు సంస్థలు, పరిశోధన సంస్థలు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ స్ఫూర్తితోనే భారత్ జోడో యాత్ర .. ఆయన నుంచి ఎన్నో నేర్చుకున్నా - రాహుల్ గాంధీ

అమరావతి, జులై 8 :వైఎస్ రాజశేఖర్ రెడ్డి అసలైన ప్రజా నాయకుడు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దివంగత నేత, మాజీ సీఎం వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా రాహుల్ నివాళులర్పించారు. ఈ మేరకు ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఎక్స్ వేదికగా వీడియో రిలీజ్ చేశారు. 'ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా ఆయనకు నా నివాళులు. ప్రజానీకానికి ఆయన నిజమైన నాయకుడు. ఎప్పుడూ ప్రజల కోసమే బతికిన నేత. ఏపీ, భారతదేశ ప్రజల అభ్యున్నతి, సాధికారతపై ఆయన చూపిన అంకితభావం, నిబద్ధత ఎంతో మందికి మార్గదర్శకం.

ఆయన ఇప్పుడు బతికే ఉంటే ఏపీ ముఖచిత్రం వేరేలా ఉండేది. కష్టాలు, కన్నీళ్లు ఉండేవి కావు. వైఎస్ఆర్ వారసత్వాన్ని షర్మిల సమర్థంగా ముందుకు తీసుకెళ్తోంది. ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుంది. వైఎస్ఆర్‌లో ఉన్న ధైర్యం, సిద్ధాంతాలు, నాయకత్వ లక్షణాలు షర్మిలలో చూశాను' అని చెప్పుకొచ్చారు. అదేవిధంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి తాను వ్యక్తిగతంగా చాలా నేర్చుకున్నట్లు చెప్పారు. భారత్ జోడో యాత్రకు రాజశేఖర్ రెడ్డి పాదయాత్రే స్ఫూర్తి అని ఈ సందర్భంగా రాహుల్ పేర్కొన్నారు. నాడు రాజశేఖర్‌రెడ్డి ఎండను, వర్షాన్ని లెక్క చేయకుండా పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే భారత్ జోడో యాత్రను చేపట్టినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

# మణికొండలో వనమహోత్సవం.. మొక్కలు నాటిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్



మణికొండ జులై 8 :వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మణికొండ మున్సిపాలిటీలోని 12వ వార్డులో సోమవారం మొక్కలు నాటడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, స్థానిక కౌన్సిలర్ శ్వేతా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పురుషోత్తం, రామకృష్ణారెడ్డి, శైలజ, కావ్య శ్రీరాములు, నవీన్, కో ఆప్షన్ సభ్యులు అహమద్ షా ఖాన్, లక్ష్మీ, సిద్ధప్ప, కమిషనర్ ప్రదీప్ కుమార్, డీఈ దివ్య జ్యోతి, ఇతర నాయకులు యాలాల నరేష్, ముత్యాలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, ప్రవీణ్ కుమార్, మహేష్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర సోషల్ జస్టిస్ మినిస్టర్ రాందాస్ అథావలేతో చంద్రబాబు భేటీ



న్యూఢిల్లీ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్); ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాజీ ఎంపీ గల్లా జయదేవ్ నివాసంలో కేంద్ర సోషల్ జస్టిస్ మినిస్టర్ రాందాస్ అథావలే తో భేటీ అయ్యారు ఈ సందర్భంగా నూతనంగా ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఢిల్లీ వచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడును కేంద్ర మంత్రివర్యులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా అనేక విషయాలు మాట్లాడుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్రమంత్రి రాందాస్ అథావలే గారిని వెంకటేశ్వర స్వామి వారికి బహుమతిగా ఇచ్చి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఆర్పిఐ ఆంధ్రప్రదేశ్ పార్టీ అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానంద రెడ్డి జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ తెలుగుదేశం పార్టీ కేంద్ర మంత్రులు పార్లమెంట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# 16 ఏళ్ల క్రితం వైఎస్ఆర్ క్రమబద్ధీకరించిన ఇళ్లు కూల్చివేత - కెటిఆర్ ఆగ్రహం ..

హైదరాబాద్, జులై 8 :పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 1లోని భారీ నిర్మాణాలను సోమవారం ఉదయం అధికారులు కూల్చివేసిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎక్స్ వేదికగా లేఖ రాశారు. మీ కాంగ్రెస్ నాయకులు అమ్మిన, మీ కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసిన ప్లాట్లలో నిర్మించుకుంటున్న ప్రజల ఇళ్లను మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఏమి ఆశించి ఈరోజు కూలగొట్టించాడో ఒకసారి విచారణ జరిపించాలని సూచించారు. ప్రజా పాలనలో ప్రజలకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులతో నిర్బంధిస్తారా? మీకు అన్నగా ప్రచారం చేసుకుంటూ సుధీర్ రెడ్డి మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో చేస్తోన్న అరాచకాలపై మీరు ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకోండని ముఖ్యమంత్రికి సూచించారు. లేదంటే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. మీ నిర్బంధాలు ప్రజాగ్రహాన్ని నిలువరించలేవన్నారు.

అమాయక ప్రజలకు ఈ ప్లాట్లను అమ్మింది కాంగ్రెస్ నాయకులు రాందాస్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్ అమర్ సింగ్ కుటుంబమని తెలిపారు. 2008లో నాటి సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో ఈ ప్లాట్లను క్రమబద్ధీకరించారని తెలిపారు. గతంలో రెవెన్యూ అధికారులు ఇది పట్టా భూమిగా ఎన్వోసీ జారీ చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకొని చాలామంది ప్రజలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇళ్లను నిర్మించుకున్నట్లు చెప్పారు. కానీ సుధీర్ రెడ్డి అధికారులను వేధించి అమాయక ప్రజలు లక్షలు పోసి నిర్మించుకున్న ఇళ్లను ఈ రోజు కూలగొట్టించారని మండిపడ్డారు.

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సాయిప్రియ, సత్యనారాయణపురం కాలనీ ప్లాట్ల యజమానుల సమస్యను శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 118 జీవో పరిధిలో చేర్చి ప్లాట్ ఓనర్స్‌కు మేలు చేసిందన్నారు. కానీ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసమర్థ ప్రభుత్వం అమాయక ప్లాట్ ఓనర్స్ ఇళ్లను కూల్చివేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై కక్షగట్టి చేస్తున్న వేధింపులకు ప్రజలు ముగింపు పలకడం ఖాయమని హెచ్చరించారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చాక వెంటనే ఆ ప్లాట్ ఓనర్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

తమ పార్టీకి చెందిన మేయర్ జక్క వెంకట్ రెడ్డిని, కార్పొరేటర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. మేం కూడా ఇలా వేధించాలనుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నామరూపాల్లేకుండా పోయేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు మళ్లీ వడ్డీ సహా చెల్లిస్తామని హెచ్చరించారు. తమ నాయకులను, మేయర్‌ను, కార్పొరేటర్లను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు.

# జెమిని టివి సీరియల్స్ ప్రసార సమయాలలో మార్పులు

హైదరాబాద్ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జెమిని టివి అభిమాన ప్రేక్షకుల కోరిక మేరకు ప్రైమ్ టైమ్ మెగా సీరియల్స్ ప్రసారం సమయాలను ఈ నెల 8వ తేదీ, సోమవారం నుండి మార్పు చేయడం జరిగింది. అత్యంత ప్రజాధారణ పొందిన అద్భుత దృశ్య కావ్యం "శ్రీమద్ రామాయణం" ఇక నుండి రా. 7 గంటలకు, , "అర్ధాంగి " సీరియల్ సాయంత్రం 6. 30 ని .లకు మరి యు భైరవి సీరియల్ రాత్రి 8 .00 గ0 ఎఎ నుండి 9 .00 గ0 ఎఎ ల వరకు గంటపాటు ప్రసారం అవుతు ందని, జెమిని టివి అభిమాన ప్రేక్షకులు ఈ ప్రసార మార్పులను గమనించి మీ అభిమాన సీరియల్స్ వీక్షించ వల సిందిగా జెమిని టివి వారు కోరడమైనది .

# మరచిపోలేని మహానేత వైఎస్ఆర్ : నీలం మధు ముదిరాజ్..



మెదక్, జులై 8 :సంక్షేమంలో తనకు తానే సాటి అంటూ ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందించిన మరిచిపోలేని మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ కంటెస్టెంట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకొని చిట్కుల్ గ్రామంలో ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. సంక్షేమ సారధిగా ప్రజలకు అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత వైఎస్ కే దక్కుతుందన్నారు. రైతన్నలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి ఉచిత విద్యుత్ ను ప్రవేశపెట్టడంతో పాటు ఒకే దఫా రుణమాఫీ చేయడమే కాకుండా సాగునీటి రంగాన్ని బలోపేతం చేశారన్నారు.

ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించారన్నారు. పేద విద్యార్థులకు ఫీజ్ రీ ఎంబర్స్ మెంట్ ప్రవేశపెట్టి ఉన్నత విద్య కలను సాకారం చేశారన్నారు. ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే నేటికి కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల భవనంపై నుండి పడి.. విద్యార్థినికి తీవ్రగాయాలు

హైదరాబాద్, జులై 8 : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం, అల్లాపూర్ శివారులో గల తెలంగాణ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని హాస్టల్ భవనంపై నుండి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి.

విద్యార్థిని రాయికోడ్ మండలం ఈసుపూర్ గ్రామానికి చెందిన పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని కింద పడటంతో నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హుటాహుటిన స్థానిక జహీరాబాద్ లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నాయి.

# ఇక తిట్లు బంద్.. అభివృద్ధిపై ఫోకస్ పెడదాం.. బండి సంజయ్

**-సమన్వయంతోనే ముందుకు సాగుదాం..**
**-కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తా..**
**-గ్రామాల ప్రగతితోనే రాష్ట్రం, దేశాభివృద్ధి**
**-పేదలను ఆదుకుంటేనే సంఘాలకు మనుగడ**
**-కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**



రాజన్న సిరిసిల్ల, జులై 8 :ఎన్నికల తంతు ముగిసింది.. ఇకపై ఒకరినొకరు తిట్టుకోవడం బంద్ చేద్దాం.. విమర్శలు, ఆరోపణలను పక్కనపెట్టి అభివృద్ధిపైనే దృష్టి సారిద్దామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించిన ఆయన సిరిసిల్ల పట్టణంలోని మున్నూరుకాపు సంఘ కళ్యాణ మండపానికి విచ్చేసి రూ. 10లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కళ్యాణ మండపం ఆవరణలో మొక్క నాటిన అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ? కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాలు, పట్టణాలు ప్రగతి బాట పడితేనే రాష్ట్రం, తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రం పక్షాన సంపూర్ణ సహకారం అందించే బాధ్యత తానే తీసుకుంటానని స్పష్టం చేశారు.

అలాగే కుల సంఘం ఆఫీస్ నిర్మిస్తే ఆ సంఘంలోని నాయకులకే ఉపయోగపడుతోందని, కానీ కుల సంఘాల తరపున కళ్యాణ మండపాలు నిర్మిస్తే ఆ కులంలోని ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి వాటికి మాత్రమే ఎంపీ ల్యాడ్స్ నిధులిస్తున్నానని, ఏ కుల సంఘమైనా సరే ఆ కులంలోని పేదలకు సహాయ సహకారాలు అందిస్తూ ఆదుకున్నప్పుడు మాత్రమే వారికి మనుగడ ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మున్నూరు కాపు సంఘం చేపట్టే ప్రజోపయోగ పనులకు తనవంతు పూర్తి సహాయ సహకారాలందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. మున్నూరు కాపు సంఘం పెద్దల ప్రతిపాదన మేరకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సహకరిస్తానన్నారు.

రెండోసారి ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించడంలో సిరిసిల్ల జిల్లా ప్రజల భాగస్వామ్యం ఉందన్నారు. రెండోసారి గెలవడం వల్లే మోదీ కేబినెట్‌లో చోటు దక్కిందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యం, రవాణా, జాతీయ రహదారులు, రైల్వేశాఖలతో పాటు సంక్షేమ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. ఆయా రంగాల నుండి నిధులు తీసుకొచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గుర్తుంచుకోవాలన్నారు. ఇకపై రాజకీయ విమర్శలు, ఆరోపణలను పక్కనపెట్టి అభివృద్ధిపైనే ఫోకస్ పెట్టి ముందుకు సాగుదామన్నారు. అంతకుముందు బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి- దామోదర రాజనర్సింహ

మహబూబ్ నగర్, జులై 8: పేదలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి ప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.

ఆదివారం జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 1003 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయితో కలిసి పరిశీలించారు. అనంతరం మెడికల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ ఇంజనీరింగ్ అధికారి నిర్మాణ వివరాలు మ్యాప్ ద్వారా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వారితో నిర్మాణ వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు.

సంవత్సరం చివరిలోగా ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్తగా నిర్మాణం చేస్తున్న జనరల్ ఆసుపత్రి 1003బెడ్ లు, ఎం.సి. హెచ్ లో 220బెడ్ లు కలిపి మొత్తం 1225 బెడ్ లకు గాను అధనంగా డాక్టర్ లు, సిబ్బంది, టెక్నీషియన్లు, ఫార్మసిస్ట్ లు, ఇతర సిబ్బంది అదనంగా 600 పైచిలుకు అవసరం వుంటుందని, ప్రభుత్వం అదనపు సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని గద్వాల, నారాయణ పేట, నాగర్ కర్నూల్ లో మెడికల్ కాలేజీల్లో అన్ని వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పి. హెచ్.సి, సబ్ సెంటర్, ఏరియా ఆసుపత్రులు, బోధన ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, సామాన్యులు సర్కార్ దవాఖానా నాది అనే విధంగా ఫీలింగ్ కల్గించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సారథ్యంలో కృషి చేస్తోందని, అన్ని ఆస్పత్రుల్లో వైద్య పరికరాలు, మందులు, అదనపు సిబ్బంది, డైట్, ఇతరత్రా సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈనెల 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగంతో చర్చించి సాగునీటి ప్రాజెక్ట్ లు, విద్య, వైద్య రంగం, పర్యాటక రంగ అభివృద్ధికి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో తదితర అంశాలపై సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, జిల్లా ఎస్.పి.డి.జానకి, అదనపు కలెక్టర్ లు శివేంద్ర ప్రతాప్, ఎస్. మోహన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కృష్ణ, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.జీవన్, తదితరులు ఉన్నారు.

# డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాన్ని ముట్టడించిన నిరుద్యోగులు

**-కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరుద్యోగులు నిప్పులు చెరుగుతుందని ఉంది ఆగ్రహం**

హైదరాబాద్ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరుద్యోగులు నిప్పులు చెరుగుతూనే ఉన్నారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రాగానే నిలువునా మోసం చేసిందంటూ డీఎస్సీ అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీని మూడు నెలల పాటు వాయిదా వేసి, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. లక్డీకాపూల్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాన్ని నిరుద్యోగులు ముట్టడించారు. ఈ సందర్భంగా ఓ యువతి కాంగ్రెస్ సర్కార్‌కు ఖతర్నాక్ ప్రశ్న వేసింది. రేవంత్ రెడ్డిని నిలదీసింది ఆమె. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మమ్మల్ని అరెస్టు చేస్తున్నారు. డీఎస్సీ వాయిదా కోసమే మేం నిరసన చేస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించే కాంగ్రెస్ నాయకులు.. విద్యా వాలంటీర్లను నియమించుకోవాలి. మరో మూడు నెలల పాటు డీఎస్సీ పోస్టుపోన్ చేసి పరీక్షలు నిర్వహించాలి. తెలంగాణలో 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇదే కాంగ్రెస్ నాయకులు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెప్పారు. అధికారంలోకి రాగానే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారు. మీరు ఇచ్చిన హామీ మేరకే మేం మెగా డీఎస్సీకి డిమాండ్ చేస్తున్నాం. మేం తీవ్రవాదులం కాదు.. విద్యార్థులం.. మమ్మల్ని ఎందుకు అరెస్టు చేస్తున్నారు. గత ప్రభుత్వాలు నిరుద్యోగులతో సమీక్షలు జరపలేదని ఇదే కాంగ్రెస్ నాయకులు అన్నారు. మరి ఇవాళ ఎందుకు నిరుద్యోగులతో సమీక్షలు నిర్వహించడం లేదు..? అని సీఎం రేవంత్ రెడ్డిని ఓ యువతి నిలదీసింది.మరో యువతి మాట్లాడుతూ.. డీఎస్సీ మూడు నెలల పాటు వాయిదా వేయాలి. సముద్రమంత సిలబస్ ఇంకో పది రోజుల్లో అయిపోతదా..? మేం రోబోలం కాదు.. మెషీన్లం కాదు. మేం కూడా సాధారణ మనుషులమే. మాకు చదువుకోవడానికి మరికొంత సమయం కావాలి.. మూడు నెలల




# బూర్గుపల్లి కృష్ణ యాదవ్‌ను పరామర్శించిన బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్ల కృష్ణ



జడ్చర్ల జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్); బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగపల్లి కృష్ణ యాదవ్ తండ్రి నారాయణ యాదవ్(76) నాలుగు తారీఖున అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న జాతీయ అధ్యక్షులు బీసీ సేన నాయకులతో కలిసి బూరుగుపల్లి కృష్ణ యాదవ్ స్వ గ్రామం బూరుగుపల్లి లోని ఆయన నివాసానికిచేరుకొని పరామర్శించారు. మనోధైర్యంగా ఉండాలని, అన్నివేళలా మీకు అండగా ఉంటామని బూర్గుపల్లి కృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. చందు, కృష్ణ డాక్టర్ కాళ్ళ నిరంజన్ ,వెంకటేష్ యాదవ్, సెలేటి వెంకటేష్, కుంభం మల్లేష్ గౌడ్ , సుధాకర్ గౌడ్, కోట్రశ్రీను, సదుర్ల తిరుపతయ్య బొల్లెమోని నిరంజన్, గొడుగు నర్సిములు సురభి విజయ్ కుమార్, గోపాల్, లింగంపేట్ శేఖర్,మాచారం శ్రీనివాస్, సురభి రఘు,రామస్వామి, రాము,,గంగోజి, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు

# తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తాం: సీఎం చంద్రబాబు

అమరావతి, జులై 8 :త్వరలోనే తెలంగాణలో టీడీపీ పార్టీకి పునర్వైభవం తీసుకొస్తామని.. తెలంగాణ గడ్డపై పుట్టిన టీడీపీ పార్టీనీ మళ్లీ నిర్మిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు విజయం సాధించిన కూటమి తరపున టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీఎంగా నాలుగోసారి ఎన్నికయ్యారు.

ఈమేరకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి హైదరాబాద్ వచ్చిన చంద్రబాబు.. ఆదివారం ఉదయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబును టీడీపీ తెలంగాణ నేతలు ఘనంగా సన్మానించారు. అనంతరం టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు.

రాష్ట్రంలో టీడీపీ నేటికి బలంగా ఉందని.. కీలక నేతలు పార్టీ మారినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీ మారలేదని.. త్వరలోనే తెలంగాణలో టీడీపీ పార్టీకి పునర్వైభవం తీసుకొస్తామని.. తెలంగాణ గడ్డపై పుట్టిన టీడీపీ పార్టీనీ మళ్లీ నిర్మిస్తామన్నారు. టీ టీడీపీ పార్టీనీ యువ రక్తంతో నింపుతానని సీఎం చంద్రబాబు తెలంగాణ నేతలకు హామీ ఇచ్చారు. అలాగే కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంతో దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని.. 2047 సంవత్సరం వరకు భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగు తుందనీ సీఎం చంద్రబాబు చెప్పుకొ చ్చారు.

తెలుగుదేశం పార్టీని యుగపురుషుడు ఎన్టీఆర్ ఇదే గడ్డపై, ఇక్కడే ఎమ్మెల్యే కాలనీలో ప్రారంభించారని గుర్తుచేశారు. తెలుగు వాడి ఆత్మగౌరవాన్ని చాటి చెప్పేందుకు టీడీపీ పుట్టుకొచ్చిందని, ప్రపంచంలో తెలుగు జాతి ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడుతుందని చంద్రబాబు చెప్పారు. తెలుగుజాతికి గౌరవం తీసుకొచ్చిన వ్యక్తి ఎన్టీఆర్.. తెలుగువాళ్లను మదరాసీ అని పిలుస్తుంటే కాదు తెలుగుజాతి అనేది ఒకటుందని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని చంద్రబాబు కొనియాడారు. కరణం, మునసబు, పటేల్ పట్వారీ వ్యవస్థతో తెలంగాణ ప్రాంత ప్రజలు పడుతున్న కష్టాలను ఎన్టీఆర్ తొలగించారని గుర్తుచేశారు.

ఆ వ్యవస్థలను ఎన్టీఆర్ రద్దు చేయడంతో మాకు స్వాతంత్ర్యం వచ్చిందని ఇక్కడి ప్రజలు సంబరాలు చేసుకున్నారని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో రెండు రాష్ట్రాలు సమాంతరంగా అభివృద్ధి చెందాలని, ఏ ప్రాంతంవైపు మొగ్గుచూపబోనని తాను చెప్పానన్నారు.

# యాదాద్రి ఆలయంలో సినీనటి మంచులక్ష్మి పూజలు..

## -సంస్కృత పాఠశాల భవన నిర్మాణం చేస్తా

## -భగాయత్ పాఠశాలలో విద్యార్థులతో సినీనటి మంచు లక్ష్మి సమావేశం..



యాదాద్రి, జులై 8 : యాదాద్రి శ్రీ లక్ష్మీ నారసింహస్వామిని సినీనటి మంచు లక్ష్మి దర్శించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని స్వయంభూ మూర్తుల దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో భాస్కర్ రావు స్వామి వారి లడ్డూ ప్రసాదం అందజేశారు. దర్శనం తదుపరి కొండ కింద ఆలయ సంస్కృత పాఠశాలను ఆలయ ఈవో భాస్కర్ రావుతో కలసి సందర్శించి, విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.

సంస్కృత పాఠశాల విద్యార్థుల కోరిక మేరకు నూతన హాస్టల్ భవనం నిర్మిస్తామని సినీనటీ మంచు లక్ష్మి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హనుమంతు కె జెండగే తో సమావేశమై భువనగిరి పట్టణ కేంద్రంలోని భగాయత్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట అదనపు కలెక్టర్ గంగాధర్, డీఈవో నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిడిఆర్ఎఫ్)ప్రదర్శనను స్వయంగా తిలకించిన జిల్లాఎస్పీ రోహిత్ రాజు

## – సుజాతనగర్ సింగభూపాలెం చెరువులో డిడిఆర్ఎఫ్ బృందంచే రెస్క్యూ ఆపరేషన్ డెమో


## – డిడిఆర్ఎఫ్ బృందంసభ్యులను అభినందించిన జిల్లాఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రికొత్తగూడెం, జులై 8 (నేటినిజం ప్రతినిధి) : రాబోయే వర్షాల దృష్ట్యా సంభవించే వరదల లో ప్రమాదవశాత్తు చిక్కుకున్న భాదితులను రక్షించడానికి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డిఆర్ఎఫ్ బృందం సోమవారం సుజాతనగర్ లోని సింగభూపాలెం చెరువులో రెస్క్యూ ఆపరేషన్ డెమో ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్ను తిలకించడానికి స్వయంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. డిడిఆర్ఎఫ్ బృందంలోని సభ్యులు చెరువులో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించే విధానాన్ని స్వయంగా ఎస్పీ బోటులో ప్రయాణించి వీక్షించారు. ఈ బృందంలోని సభ్యులు చేసిన ప్రదర్శనను తిలకించి ఎస్పీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. డిడిఆర్ఎఫ్ బృందానికి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న ఆర్ఎస్ఐ సుమంత్ రెస్క్యూ ప్రక్రియ మొత్తాన్ని ఎస్పీకి వివరించారు. జిల్లాలోని ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణను పొందిన డిడిఆర్ఎఫ్ బృందం సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఈ సందర్భంగా తెలియజేశారు. మొత్తం 20 మంది సభ్యులతో ఈ డిడిఆర్ఎఫ్ బృందాన్ని తయారు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా గోదావరి నది వరదలు సంభవించినప్పుడు నదీ పరిసర ప్రాంతాలలో నివసించే లోతట్టు ప్రజలను సంరక్షించడానికి ఈ బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. రెస్క్యూ సమయంలో అవసరమయ్యే లైవ్ జాకెట్స్, లైఫ్ బాయ్ రింగ్స్, బోట్ పెడల్స్,రోప్స్, ఇతర సామాగ్రి మొత్తాన్ని ఈ బృందానికి సమకూర్చడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఆర్ఐ రవి, సుజాత నగర్ ఎస్సై జుబేదా, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, జులై 8 :(నేటినిజం ప్రతినిధి): జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మంత్రి కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో సమావేశమయ్యారు. జిల్లాలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నగరాల్లో త్రాగునీటి కొరత తలెత్తకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ పకడ్బందీగా చేయాలన్నారు. యువతకు మత్తు పదార్థాలు అందించే ముఠాలను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు. కలెక్టరేట్ కు వచ్చిన మంత్రికి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన మంత్రి, వాటిని కలెక్టర్ కు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.

# భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి సుమితా దావ్రాతో ఇండస్ట్రీ ఇంటరాక్షన్

న్యూఢిల్లీ, జులై 8 :కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సి.ఐ.ఐ.), ఎంప్లాయర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇ.ఎఫ్.ఐ.)ల ఆధ్వర్యంలో 5 జూలై 2024న హైదరాబాద్‌లో నిర్వహించిన ఒక ఇండస్ట్రీ ఇంటరాక్షన్‌లో భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి శాఖ కార్యదర్శి శ్రీమతి సుమితా దావ్రా పాల్గొన్నారు.

ఈ సదస్సు ప్రారంభ ఉపన్యాసంలో, కార్మిక, ఉపాధి శాఖ కార్యదర్శి శ్రీమతి సుమితా దావ్రా భారతదేశం యొక్క వేగవంతమైన వృద్ధి రేటును ప్రధానంగా ప్రస్తావించారు, తయారీ, సేవా రంగ విస్తరణ, మౌలిక సదుపాయాలు మొదలైన ఇతర వృద్ధి ఇంజిన్‌లతో పాటు భవిష్యత్ వృద్ధి కోసం భారతదేశం యొక్క డెమోగ్రఫిక్ డివిడెండ్, కార్మిక సంస్కరణలు కీలకమైనవని పేర్కొన్నారు.

ఆర్.బి.ఐ. యొక్క కె.ఎల్.ఇ.ఎమ్.ఎస్ డేటాను ఉటంకిస్తూ, భారతదేశంలో గత ఐదేళ్లలో 2021-22 ముగింపు సమయానికిరి దాదాపు 8 కోట్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడ్డాయని, తయారీ రంగానికి ప్రోత్సాహకాలు, ప్రోత్సాహం అందించడం లక్ష్యంగా గల వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు (పి.ఎల్.ఐ., మేక్ ఇన్ ఇండియా వంటివి), సేవా రంగం విస్తరణ, మైక్రో క్రెడిట్ యాక్సెస్, పెట్టుబడులు, గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ వర్కర్స్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జి.సి.సి.లు), స్టార్టప్స్ మొదలైనటువంటి కొత్త రంగాల ఆవిర్భావం వంటి వాటి ద్వారా ఇది సాధ్యమైందన్నారు. 2030 నాటికి దాదాపు 2.3 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తుందనే అంచనాలు గల గిగ్ ఎకానమీని గురించి ఆమె మరింత ప్రత్యేకంగా ప్రస్తావించారు.

కార్మిక చట్టాలను నేరరహితం చేయడం సహా నిబంధనలు మరియు పరిపాలనా ప్రక్రియలను సులభతరం చేయడం తద్వారా వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం, అనుమతుల భారాన్ని తగ్గించడం లక్ష్యంగా 29 కార్మిక చట్టాలను నాలుగు సమగ్ర కోడ్‌లుగా ఏకీకృతం చేయడం గురించి దావ్రా చర్చించారు. మెరుగైన దేశీయ, విదేశీ పెట్టుబడులు, సప్లయ్ చైన్స్, గ్లోబల్ వాల్యూ చైన్స్ భారతదేశానికి తీసుకురావడంలో ఇది ఆకర్షణీయంగా ఉంటుందని ఆమె తెలిపారు. సంస్కరణలు ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తాయని, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయని, మహిళా శ్రామికశక్తి భాగస్వామ్యాన్ని పెంచుతాయని, సామాజిక భద్రత, కార్మిక సంక్షేమంలో మెరుగుదల సాధ్యపడుతుందని, ఇవన్నీ భారతదేశాన్ని సమ్మిళిత వృద్ధి సాధన దిశగా నడిపిస్తాయని ఆమె అన్నారు. ప్రస్తుతం, భారతదేశ జిడిపి 3 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉందని అయితే కార్మిక సంస్కరణలు సహా వివిధ కార్యక్రమాల కారణంగా ఇది 2047 నాటికి 33 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆమె పేర్కొన్నారు.

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇ.ఎస్.ఐ.సి.), ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇ.పి.ఎఫ్.ఓ.)లలో పాలనాపరమైన సంస్కరణల అవసరాన్ని గుర్తిస్తూనే అసంఘటిత మరియు అనధికారిక రంగాలకు సామాజిక భద్రతా కవరేజీని విస్తరించడం యొక్క ప్రాముఖ్యతను శ్రీమతి దావ్రా ప్రధానంగా ప్రస్తావించారు. ఆమె ఇ.ఎస్.ఐ.సి., ఇ.పి.ఎఫ్.ఓ.లలో క్లెయిమ్‌ల స్వయంచాలక పరిష్కారం, తిరస్కరణలను తగ్గించడం, ఇ.పి.ఎఫ్.ఓ.లో క్లెయిమ్‌ల పరిష్కార వేగాన్ని మెరుగుపరచడం, అలాగే ఇ.ఎస్.ఐ.సి.లో సేవల కవరేజ్ మరియు నాణ్యతను మెరుగుపరచడం వంటి వివిధ విధానపరమైన సంస్కరణలను కూడా హైలైట్ చేశారు.

ఈ ఇంటరాక్షన్ సందర్భంగా, ఇ.ఎస్.ఐ.సి. మరియు ఇ.పి.ఎఫ్.ఓ.లలో వివిధ విధానపరమైన సంస్కరణలను గురించి డిజిటలైజేషన్, ఇ-గవర్నెన్స్, అనుమతులను సులభతరం చేయడం వంటి అంశాలను వివరిస్తూ ప్రజెంటేషన్స్ ఇవ్వబడినవి, ఈ విధానాలను మరింత మెరుగుపరచడానికి పార్టిసిపెంట్స్ సూచనలను స్వీకరించే లక్ష్యంతో చర్చలు జరిగాయి.

కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్.సి.ఎస్.) పోర్టల్ కూడా కెరీర్ కౌన్సెలింగ్, ఉపాధి నెట్‌వర్కింగ్ కోసం సమగ్ర పరిష్కారంగా చూపబడింది. 2023-24లో ఎన్.సి.ఎస్. పోర్టల్‌లో 1 కోటి కంటే ఎక్కువ ఉద్యోగాల ఖాళీలు సమీకరించబడినట్లు ప్రధానంగా ప్రస్తావించబడింది. లేబర్ మార్కెట్‌లో నైపుణ్య అంతరాన్ని తగ్గించడానికి పోర్టల్‌లో నైపుణ్యం కలిగిన ఉద్యోగార్థులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చేయడానికి నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ నుండి ఎస్.ఐ.డి.హెచ్. డేటాబేస్‌ను పోర్టల్ ఏకీకృతం చేస్తుంది. రెండు మంత్రిత్వ శాఖల డేటాబేస్‌ల నిరంతర ఏకీకరణ యువతను నైపుణ్యాలు, ఉపాధి రెండింటినీ సమర్థవంతంగా అనుసంధానిస్తుంది, ఫలితంగా లేబర్ మార్కెట్లో డిమాండ్-సరఫరా అంతరాన్ని సమలేఖనం చేస్తుంది.

ఆర్థికాభివృద్ధి, ఉపాధి వృద్ధి కోసం సానుకూల వాతావరణాన్ని కల్పించుటకు ప్రభుత్వం, పరిశ్రమల మధ్య సహకార ప్రయత్నాలను ఈ సెషన్ ప్రధానంగా ప్రస్తావించినది. పరిశ్రమ, ఇతర వాటాదారుల అభిప్రాయాన్ని పొందడంతోపాటు, అవగాహన కల్పించుటకు, సంస్కరణలను సమర్థంగా అమలు చేయుటకు ఇటువంటి ఇంటరాక్షన్స్ కీలకమైనవి అవుతాయి.

సెషన్‌లో పాల్గొన్న 300 మందికి పైగా పరిశ్రమల ప్రతినిధులు భారతదేశ ఆర్థిక దృశ్య రూపకల్పనలో కీలకమైన కార్మిక మరియు ఉపాధి సంస్కరణల గురించి ఆసక్తిగా చర్చించారు. కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ, ఇ.పి.ఎఫ్.ఓ., ఇ.ఎస్.ఐ.సి., తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

భారతదేశంలో ఉపాధి కల్పన, కార్మిక సంస్కరణలు, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం గురించి ప్రభుత్వ అధికారులు మరియు పరిశ్రమల వాటాదారుల మధ్య చర్చలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది.

# విజయవంతంగా పూర్తైన కంబోడియా సివిల్ సర్వెంట్లకు ప్రభుత్వ విధానం, పాలనపై 5వ సామర్థ్య నిర్మాణ కార్యక్రమం

న్యూఢిల్లీ, జులై 8 :న్యూఢిల్లీలోని జాతీయ సుపరిపాలన కేంద్రం (ఔఅఉఉ) కంబోడియా సివిల్ సర్వెంట్లకు ప్రభుత్వ విధానం, పాలనపై ఐదో సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో 2024 జూన్ 24 నుంచి జులై 5 వరకు రెండు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంబోడియా నుంచి 40 మంది సివిల్ సర్వెంట్లు హాజరయ్యారు. వారిలో సివిల్ సర్వీసెస్ మంత్రిత్వ శాఖ, కంబోడియా సెనేట్ జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ, అండర్ సెక్రటరీ ఉన్నారు. విధాన చర్చలు, ఉత్తమ ఆచరణ విధానాలను పంచుకునేందుకు ఈ కార్యక్రమం వేదికను అందించింది. సంస్థాగత పరివర్తన, పౌరుల భాగస్వామ్యంపై భాగస్వాములకు విలువైన భావనలను అందిస్తుంది.

ముగింపు సభకు సుపరిపాలన కేంద్రం డైరెక్టర్ జనరల్, భారత ప్రభుత్వ పరిపాలన సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యదర్శి వి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక స్నేహపూర్వక, చారిత్రక సంబంధాల ప్రాధాన్యాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. పౌరులకు, ప్రభుత్వానికి మధ్య సంబంధాలను సరళీకృతం చేయడం ప్రభుత్వోద్యోగుల పాత్ర అన్నారు. పారదర్శకత, జవాబుదారీతనాన్ని అనుకూలీకరిస్తూ పౌరులను ప్రభుత్వానికి మరింత చేరువ చేయడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించిందని, ఫిర్యాదుల పరిష్కార నమూనా ద్వారా ఉదాహరణలను ఉటంకిస్తూ వివరించారు. అద్భుత ప్రదర్శన ఇచ్చారంటూ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులను అభినందించారు.

గౌరవ అతిథి కంబోడియా హైకమిషనర్ కోయ్ కువోంగ్ రెండు దేశాల నాగరికతల మధ్య ప్రాచీన సంబంధాల గురించి మాట్లాడారు. తమ అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించడంలో భారత ప్రభుత్వ సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. రెండు దేశాలు విజ్ఞానాన్ని, వివేకాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాయని; తీర్థయాత్రలు, వైద్య అవసరాల కోసం ప్రజలు దేశాల మధ్య ప్రయాణిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైనవారు దీని ద్వారా గ్రహించిన అంశాలను ఆకర్షణీయంగా ప్రదర్శించడం ప్రోత్సాహకరంగా ఉందన్నారు. మానవ మూలధన నిర్మాణం లక్ష్యంగా ఉన్న ద్వైపాక్షిక సంబంధాలు ఇరుదేశాల మధ్య సహకారానికి కీలకమని ఆయన స్పష్టం చేశారు. సాధారణ ప్రజల ఆకాంక్షలను తీర్చడానికి అవి ఆవశ్యకం, తద్వారా సుపరిపాలనను సాధించడంలో దోహదపడతాయి.

ఈ అవకాశం కల్పించిన భారత ప్రభుత్వానికి కంబోడియా సెనేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, కంబోడియా ప్రతినిధి బృందం అధిపతి సే పగ్నృతే కృతజ్ఞతలు తెలిపారు. కంబోడియా సివిల్ సర్వీస్ అధికారులకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఎన్సీజీజీ డైరెక్టర్ జనరల్ శ్రీ వి.శ్రీనివాస్, శిక్షణ బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విధానం, పాలన రంగంలోని అనేక ఉత్తమ ఆచరణలపై వారు ఎలా నేర్చుకున్నారో, దేశంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించుకుంటున్నారో ఆమె వివరించారు. ఇలాంటి అనుభవం కోసం తాము ఎదురు చూస్తున్నామని, దీనివల్ల అధికారులు తమ దేశ ప్రజలకు మెరుగైన సేవలు అందించి, సుపరిపాలనకు దోహదపడుతారని ఆమె అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తమ అభ్యసన ఫలితాల్లో భాగంగా 'కంబోడియాలో విధాన రూపకల్పన, అమలులో పౌర సేవల పాత్ర', 'కంబోడియాలో సామాజిక రక్షణ', 'మిశ్రణ సాంకేతికత దిశగా కంబోడియా, 2050', 'విధాన రూపకల్పన, అమలులో కంబోడియా పార్లమెంటు పాత్ర' అనే అంశాలపై నాలుగు విస్తృతమైన, విలువైన ప్రదర్శనలు అందించారు.

ఎన్సీజీజీ అసోసియేట్ ప్రొఫెసర్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ బి.ఎస్.బిష్ట్ ఈ కార్యక్రమంపై సవివరమైన సమాచారాన్ని అందించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం - మొదటి వారంలో ప్రభుత్వ విధానం, నిర్వహణ సహా వివిధ అంశాలపై శిక్షణలో దృష్టి సారించారు. ప్రభుత్వ సేకరణలో పారదర్శకత, భారత రాజ్యాంగ వ్యవస్థలో పార్లమెంటు, భారత్-కంబోడియా సంబంధాలు, మౌలిక సదుపాయాల్లో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం, సుపరిపాలన సాధనంగా ఆధార్, ఆరోగ్య పాలన, పాలనపై పార్లమెంటరీ సాధనాల ప్రభావం, వివిధ అభివృద్ధి పథకాల ద్వారా ఉత్తమ విధానాలు, 2023 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించే విధానాలు మొదలైనవి అందులో ఉన్నాయి. వికసిత భారత్: పరిశ్రమలు, మౌలిక సదుపాయాలలో విధానాలు, అభివృద్ధి; ఆర్థిక సమ్మిళితత్వం, పాలన, నాయకత్వం, కమ్యూనికేషన్ లో మారుతున్న నమూనా; పట్టణ పాలన మరియు సుస్థిర నగరాలు, భారతదేశంలో పౌరసేవలు, ఇంటివద్దకే సేవలందించడం, ఈ-గవర్నెన్స్ మరియు ప్రజాసేవలను సాంకేతికంగా అందించడం, లింగ సమానత, పాలనలో నైతికత, ఫసల్ బీమా యోజన ఆదర్శవంతమైన అమలుపై పీఎం అవార్డు మొదలైనవి ఉన్నాయి.

రెండో దశలో డెహ్రాడూన్ లోని స్మార్ట్ సిటీ ప్రాజెక్టు, సమాచార సాంకేతికాభివృద్ధి సంస్థ; ఉత్తరప్రదేశ్ లోని గౌతమబుద్ధ నగర్ పాలన, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, భారత పార్లమెంటుల క్షేత్ర పర్యటన నిర్వహించారు. ప్రధాని సంగ్రహాలయ, బుద్ధ ఆలయం, తాజమహల్ సందర్శన సందర్భంగా దేశ చరిత్ర, సంస్కృతిని ఈ కార్యక్రమం తెలియజేస్తుంది.

బంగ్లాదేశ్, కెన్యా, టాంజానియా, ట్యునీషియా, సీషెల్స్, గాంబియా, మాల్దీవులు, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, లావోస్, వియత్నాం, నేపాల్, భూటాన్, మయన్మార్, ఇథియోపియా, ఎరిట్రియా, కంబోడియా వంటి 17 దేశాల సివిల్ సర్వెంట్లకు జాతీయ సుపరిపాలన కేంద్రం శిక్షణ ఇవ్వడం గమనార్హం.

ముగింపు వేడుకకు ఎన్సీజీజీ సీఈవో ప్రిస్కా మాథ్యూస్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హిమాన్షి రస్తోగి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గజాల హసన్ తదితరులు హాజరయ్యారు. ఎన్సీజీజీ సామర్థ్య నిర్మాణ బృందంతో పాటు కోర్సు సమన్వయకర్త డా. బి.ఎస్. బిష్ట్, సహ సమన్వయకర్త డా. సంజీవ్ శర్మ, శిక్షణ సహాయకుడు బ్రిజేశ్ బిష్ట్, యువ అధికారి మోనీషా బహుగుణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# మృతుల ఇళ్లకువెళ్లి నివాళులర్పించిన ఎంపీ రఘురాంరెడ్డి

## - ఎర్రబోలు సూర్యనారాయణ రెడ్డి, మూడు శివ కుటుంబాలకుపరామర్శ



ఖమ్మం, జులై 8 :(నేటినిజం ప్రతినిధి): అనారోగ్య కారణాలతో ఈశ్వర మాదారంలో మృతి చెందిన మాజీ సర్పంచ్ ఎర్రబోలు సూర్యనారాయణ రెడ్డి తండ్రి రంగారెడ్డి మృతదేహాన్ని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి సోమవారం సందర్శించి నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులు సూర్యనారాయణ రెడ్డి, ఇతరులను ఈ సందర్భంగా ఓదార్చారు. ఇదే మండలంలో బురాన్ గుట్ట తండాలో మూడు శివ సతీమణి అంకిత మృతి చెందగా ఆమె మృతదేహాన్ని ఎంపీ సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

# సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి : ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, జులై 8 :బాగ్అంబర్‌పేట డివిజన్ కుర్మబస్తీ, పోచమ్మబస్తీల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ముందుగా రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. డివిజన్ కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డి, వివిధ ప్రభుత్వ అధికారులతో కలిసి సోమ వారం ఎమ్మెల్యే కుర్మబస్తీ, పోచమ్మబస్తీలో పాదయాత్ర నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయా బస్తీలలో వాటర్‌వర్క్స్ అధికారులు రోడ్డును తవ్వి పైప్‌లైన్ పనులు చేపట్టారు. ఆ రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రాబోవు బోనాల పండుగకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అలాగే కలుషిత మంచినీరు లేకుండా స్వచ్ఛమైన మంచినీరు ప్రజలకు సరఫరా చేయాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని ఆయన తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.. చాడ వెంకట్ రెడ్డి



వరంగల్, జులై 8 : తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగులో ఉన్న అన్ని సమస్యలకు ముఖ్యమంత్రుల సమావేశం శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హనుమకొండ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఉట్కూరి రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చాడ వెంకట్ రెడ్డి హాజరయ్యారు.

అనంతరం జరిగిన మీడియా సమావేశంలోనూ చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ? గత పదేళ్లుగా పెండింగులో ఉన్న తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకుని సమావేశం కావడం హర్షనీయమని, ఇప్పటికైనా పూర్తి స్థాయిలో అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన భాద్యత కేంద్రప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణకు రావాల్సిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, యువత ఉపాధికి భారీ పరిశ్రమలు లాంటి హామీలు అమలు చేయాలన్నారు. తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని, బొగ్గు గనులను ప్రైవేటు పరం చేయబోమని ఎన్నికల ముందు చెప్పి నేడు టెండర్ లు పిలుస్తున్నారన్నారు. తెలంగాణాలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే టెండర్ లు పిలుస్తున్నారని విమర్శించారు.

నేడు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి ముకుతాడు వేసేలా గట్టి ప్రతిపక్షం ఏర్పడిందని, ఇక గతంలో మాదిరిగా మోడీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు కాలం చెల్లిందన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలను సమన్వయం చేసుకుని దేశంలోని ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న బీజేపీ, ఎన్డీఏ ఆగడాలను అరికట్టేందుకు వామపక్ష లౌకిక శక్తులను కాంగ్రెస్ కలుపుకుపోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, కూడు, గూడు, గుడ్డ అందేలా కృషి చేయాలన్నారు.

అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలు కావస్తున్నదని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపాలన ధరఖాస్తులకు పరిష్కారం చూపాలని, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెంచిన పింఛన్లు, పెండింగులో ఉన్న రేషన్ కార్డులను అందించాలన్నారు. రైతు భరోసాపై ముఖ్యమంత్రి అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని, కౌలు రైతులకు కూడా వర్తింప చేయాలని సూచించారు. అలాగే రైతు రుణమాఫీ, విద్యార్థుల ఫీజు రీఎంబర్స్ మెంట్ ఇవ్వాలన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు కావస్తున్న సందర్భంగా గ్రామ గ్రామాన పార్టీ బలోపేతానికి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాలు కోసం ఆందోళనలు..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు

పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలపై గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు తెలిపారు. జూలై 19న తహశీల్దారు కార్యాలయాల ఎదుట, జూన్ 26న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఆగస్టు 22, 23, 24 తేదీల్లో పార్టీ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయ సారథి, నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, బికెఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణహితంగా వేడుకలు, ఉత్సవాలు చేసుకొంటే మేలు: డిప్యూటీ సీఎం



అమరావతి, జులై 8 :పండుగలు, ఉత్సవాలు పర్యావరణ హితంగా జరుపుకోవాలని, అప్పుడే పర్యావరణం బాగుంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడాలంటే అదొక్కటే మార్గమని ఆయన అన్నారు. వినాయక చవితికి మట్టి విగ్రహాలను పూజించేలా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.

డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ చేపట్టిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలపై వరుసగా సమీక్షలు చేస్తున్నారు పవన్ కళ్యాణ్. ప్రజా ప్రయోజనాలు, అభివృద్ధి, అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు నిర్మాణాత్మక సూచనలు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆదేశాలు ఇస్తున్నారు. ఈ క్రమంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు, వివిధ వర్గాల ప్రజల నుంచి పలు సూచనలు, అభిప్రాయాలు పవన్ కళ్యాణ్ కార్యాలయానికి అందుతున్నాయి. తమ అనుభవాలను తెలియచేస్తూ నివేదికలు పంపిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, పర్యావరణ ప్రేమికుడు విజయ రామ్ మంగళగిరిలో పవన్ కళ్యాణ్ ను ఆయన నివాసంలో కలిశారు. పర్యావరణానికి హాని చేయని విధంగా వస్తువుల వినియోగాన్ని పెంచేందుకు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన గోవింద భోగ్, రత్న చోడి, మాప్పిళ్లై సాంబ తదితర బియ్యం రకాలను పవన్ కు చూపించారు.

పిఠాపురం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా..

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పర్యావరణహితమైన వస్తువుల వాడకాన్ని మన వేడుకలు, ఉత్సవాల్లో వాడితే మేలు కలుగుతుంది. వినాయక చవితి రాబోతుంది. ఈ వేడుకల్లో మట్టి గణపతి ప్రతిమలను పూజిస్తే పర్యావరణానికి ప్రయోజనం కలుగుతుంది. జల కాలుష్యాన్ని అరికట్టవచ్చు. మట్టి గణపతికి పూజలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో మట్టితో చేసిన వినాయక విగ్రహాలు పూజించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించాము.

అదే విధంగా దేవాలయాల్లో ప్రసాదాలను బటర్ పేపర్ తో చేసిన కవర్లలో అందిస్తున్నారు. బటర్ పేపర్ వినియోగాన్ని తగ్గించాలని పలువురు నిపుణులు సూచించారు. అలాంటి కవర్ల స్థానంలో చిన్నపాటి తాటాకు బుట్టలు, ఆకులతో చేసిన దొన్నెలు వాడితే అవి వ్యర్థాల నిర్వహణ కూడా సులభం. వీటి వినియోగాన్ని పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న ఆలయాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించబోతున్నాము" అన్నారు.

# నార్త్‌లో బలం తగ్గిన బీజేపీ సౌత్ మీద దృష్టి పెట్టింది

## -తెలంగాణ లో కూడా బీజేపీ..ఏపీ లో వేసిన ఎత్తుగడ వేయాలని చూస్తున్నారు
## -కాంగ్రెస్ నాయకత్వం.. కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలి
## -ఇప్పటికే ఈడిసీబీఐ కేసులు ఉన్న వాళ్ళతో బిజెపి నిండి పోయింది
## -ఈడి సిబిఐ ఐటిల వల్లనే బిజెపి అధికారం లోకి వచ్చింది
## -వీటిని ఉపయోగించకపోతే రాహూల్ గాంధీ ప్రధాని అయ్యేవారు
## -టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్ జూలై న8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీజేపీ కి నార్త్ లో బలం తగ్గింది అని సౌత్ మీద దృష్టి పెట్టిందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సోమవారం గంగానది భవన్ లో మీడియా సమావేశంలోమాట్లాడుతూ ఏపీ..తెలంగాణ..కర్ణాటక మీద ఫోకస్ పెట్టడం మూలంగానే .

ఈ మూడు రాష్ట్రాల్లో ఫలితాలే బీజేపీ కి అధికారం తెచ్చిందన్నారు. లేదంటే ఇండియా కూటమి అధికారంలోకి వచ్చేది. దీనిపై. కాంగ్రెస్ నాయకత్వం.. కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాల్సిన సందర్భం వచ్చిందని ఆయన హెచ్చరించారు.. ఏపీ లో బీజేపీ ఇండైరెక్ట్ గా జగన్ నీ మెయింటెయిన్ చేసిందని,. పవన్ కళ్యాణ్ తో చంద్రబాబు నీ కంట్రోల్ లో పెట్టుకుందని . నాలుగు స్థంభాల ఆట జరిగిందన్నారు. . ఎవరి రాజకీయ పార్టీల ఎత్తుగడ వారిది కొన్ని సందర్భాల్లో పార్టీలు బలహీన పడతాయి.. కొన్ని సందర్భాల్లో బలపడతాయి రాజకీయాల్లో ఇది సహజమన్నారు.. ఏడాదిన్నర నుండే టీడీపీ నీ పవన్ కళ్యాణ్ ఎంకరేజ్ చేస్తూ వచ్చాడు , ఏపీ లో పట్టులేని బీజేపీ కి మూడు ఎంపీ సీట్లు గెలిచిందన్నారు.. చంద్రబాబుని జగన్ జైల్లో పెట్టకుండా ఉంటే.. ఎన్నికలు టైట్ ఉండేది . నాలుగు స్తంభాల ఆట లో కాంగ్రెస్ లేవకుండా చేస్తున్నారన్నారు.. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని,తెలంగాణ లో కూడా బీజేపీ..ఏపీ లో వేసిన ఎత్తుగడ వేయాలని చూస్తున్నారన్నారు.. టిడిపి నీ ముందు పెట్టి రాజకీయం మొదలుపెట్టింది బీజేపీ .బీజేపీ డైరెక్షన్ లో చంద్రబాబు.. పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారు . మూడు పార్టీలకు తోడు... కేసీఆర్ పార్టీ బలంగానే ఉంటది కూతురు జైల్లో ఉన్నా... బీజేపీ తో కొట్లాడాలి నీ చూస్తాడా..? బీజేపీ కి తెలంగాణ లో నాలుగో స్థంభం గా కేసీఆర్ మారుతారా అనే అనుమానం ఉంది చంద్రబాబు గతంలో హైదరాబాద్ వచ్చి పోయేది కూడా తెలియకపోయేది విభజన పేరుతో... చంద్రబాబు ఎంటర్ అయ్యాడు . బండి సంజయ్ సమర్థించారు. అంటే ఇవన్నీ బీజేపీ లైన్ లోనే నడుస్తున్నట్టుచంద్రబాబు...బీజేపీ చేతిలో పావు తన అసలు రాజకీయ రంగు బయట పెట్టాడు చంద్రబాబురెండు రాష్ట్రాలు రెండు కండ్లు అన్నాడు.. హైటెక్ సిటీ.. సాఫ్ట్ వేర్ అభివృద్ధి నాదే అంటున్నాడు కానీ హైటెక్ సిటీ కి పునాది వేసింది కాంగ్రెస్ సిఎం నేదురుమల్లి జనార్ధన్ రెడ్డిఐటి అభివృద్ధిని చంద్రబాబు కొనసాగించారు.. వైఎస్.. రోశయ్య.. కిరణ్ కుమార్ రెడ్డి... కేసీఆర్ లు కొనసాగించారు బీజేపీ ఎన్ని వ్యూహాలు చేసినా కాంగ్రెస్ కార్యకర్తల శక్తిని చంపలేరురాజు యుద్ధం చేసి గెలుస్తాడుసంగారెడ్డి రాజ్యానికి మళ్ళీ మా ప్రజలు గెలిపించుకుని రాజుని చేస్తారు నామినేట్ పదవులకు యోధుడు పోటీ పడడుబండి సంజయ్ ఈడి సిబిఐ కేసులు ఉన్నవాళ్ళని బీజేపీ లోకి తీసుకొం అంటున్నారు ఇప్పటికే ఈడీసీబీఐ కేసులు ఉన్న వాళ్ళను చేర్చుకున్నారు కేజ్రీవాల్ బెండ్ అవ్వడం లేదని బెయిల్ ఇవ్వడం లేదు ఇంకో నాలుగు నెలలు అయినా.. కేజ్రీవాల్ కి బెయిల్ ఇవ్వాల్సిందే కోర్టు బీజేపీ ఇంకా నిలబడుతుంది అంతే ఈడి సిబిఐ ఐటిల వల్లనే బిజెపి అధికారం లోకి వచ్చిందని,వీటిని ఉపయోగించకపోతే రాహూల్ గాంధీ ప్రధాని అయ్యేవారు అన్నారు.

# నూతి శ్రీకాంత్ గౌడ్‌కి శుభాకాంక్షలు తెలిపిన ఓబీసీ నేతలు

ఖమ్మం, జులై 8 :(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన నూతి శ్రీకాంత్ గౌడ్ కి మహానేత వైఎస్సార్ జన్మదినం రోజున పదవి రావడం చాలా సంతోషకరమని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఓబీసీ జిల్లాఅధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ లు హృదయపూర్వక దన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# చెన్నై పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ అధికారి అరుణ్..

చెన్నై, జులై 8 : తమిళనాడు శాఖ బీఎస్పీ అధ్యక్షుడుకె ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య నేపథ్యంలో బదిలీ అయిన చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ స్థానంలో కొత్త సీపీ వచ్చారు. ప్రస్తుతం చెన్నై నగర అదనపు పోలీస్ కమిషనర్‌గా ఉన్న ఐపీఎస్ అధికారి ఎ అరుణ్ .. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడు కే ఆర్మ్‌స్ట్రాంగ్ మూడు రోజుల క్రితం చెన్నై నగరంలో దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసును తమిళనాడు సర్కారు సీరియస్‌గా తీసుకుంది. ఘటనకు బాధ్యుడిగా చెన్నై సీపీ సందీప్ రాయ్ రాథోడ్‌ను బదిలీ చేసింది.

పోలీస్ ట్రెయినింగ్ కాలేజీ డీజీపీగా ఆయనను నియమించింది. అడిషనల్ సీపీగా ఉన్న ఎ అరుణ్‌ను చెన్నై నగర కొత్త కమిషనర్‌గా నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ శుక్రవారం రాత్రి పెరంబూరులోని తన ఇంటికి సమీపంలో హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు బైకులపై వచ్చి ఆయనను హత్య చేశారు.

ఆదివారం బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి చెన్నైకి వచ్చి ఆర్మ్‌స్ట్రాంగ్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఆర్మ్ స్ట్రాంగ్ హత్య కేసును తమిళనాడు ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆర్మ్ స్ట్రాంగ్ హత్యతో దళిత నేతలు భయాందోళనకు గురవుతున్నారన్నారు.

# పోచమ్మ తల్లి ఆలయంలో చోరీ.. ఇద్దరు నిందితుల అరెస్ట్

హైదరాబాద్, జులై 8 : చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 5న షాపూర్ నగర్‌లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాపల్లికి చెందిన కే.సంజయ్ (25), మహారాష్ట్ర చెందిన బి.మహేష్ (23) ఎన్‌ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ ఇద్దరు వ్యక్తులు ఈ నెల 5వ తేదీ రాత్రి నల్లపోచమ్మ ఆలయంలోని హుండిని పగులగొట్టి రూ.1000 నగదును దొంగలించారు.

సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరు నిందితులను గుర్తించిన పోలీసులు ఎన్‌ఎల్ బీనగర్‌లో అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1000 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. తమ కాలనీల్లో ప్రజలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు.

# తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించిన గవర్నర్ బండారు దత్తాత్రేయ



హైదరాబాద్, జులై 8 :మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయపరామర్శించారు. ఇటీవల మరణించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ నివాసానికి వెళ్లిన గవర్నర్ దత్తా త్రేయ శంకర్ యాదవ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్య లను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

మోండా మార్కెట్ అధ్యక్షుడిగానే కాకుండా బోయిన్ పల్లి మార్కెట్ ట్రేడర్స్ అధ్యక్షుడిగా కూడా పని చేసిన శంకర్ యాదవ్ అటు ట్రేడర్స్, ఇటు కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరి ష్కారానికి పాటుపడ్డారని గుర్తు చేశారు. కాగా, మోండా మార్కెట్ చైర్మన్ తలసాని శంకర్ యాదవ్ మరణిం చారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సికింద్రాబాద్ యశోదలో చికిత్స పొందు తున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో కొద్ది రోజుల క్రితం కన్నుమూశారు.

# మండే బ్లూస్ మాదిరిగా టమాటా కష్టాలు.. సెంచరీకి చేరువలో కిలో టమాటా..



హైదరాబాద్, జులై 8 :మండే బ్లూస్ మాదిరిగా మళ్లీ టమాటా కష్టాలు వచ్చేశాయి. రోజువారీ కూరల్లో టమాటాల వాడకం తప్పనిసరి. సకాలంలో వర్షాలు కురవక పోగా హీట్ వేవ్ వల్ల వేసిన టమాటా తోటల నుంచి దిగుబడి తగ్గడంతో టమాటాలకు గిరాకీ పెరిగింది. దీంతో ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై మెట్రో నగరాలతోపాటు పలు నగరాలు, పట్టణాల్లో కిలో టమాటా ధర సుమారు రూ.90 పలుకుతోంది. ఒకవైపు, ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు ఆర్బీఐ ప్రయత్నాలు చేస్తుంటే.. మరోవైపు అకస్మాత్‌గా టమాటా ధరలు పెరిగి పోవడంతో ఆహార వస్తువుల విభాగంలో అనిశ్చితి నెలకొంది.

హీట్ వేవ్ పరిస్థితుల నేపథ్యంలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతోపాటు దేశంలోని పలు ప్రాంతాల్లో టమాటాలు కొనుగోలు చేసే వారి జేబులకు చిల్లు పడుతోంది. టమాటాల దిగుబడి తగ్గడంతోపాటు సరఫరా వ్యవస్థలో ప్రతికూల ప్రభావం పడుతున్నదని చెబుతున్నారు. టమాటా ఎక్కువగా పండించే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతల వల్ల రబీ సీజన్ పంట దిగుబడి తగ్గిపోయింది.. ఫలితంగా మార్కె?ట్లోకి వస్తున్న టమాటాలు 35 శాతం తగ్గాయని ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ పేర్కొంది.

మరోవైపు ఈశాన్య రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్‌లో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో రోడ్లు దెబ్బ తిన్నాయి. తత్ఫలితంగా ప్రధాన కేంద్రాలకు టమాటాల సరఫరా తగ్గిపోయిందని చెబుతున్నారు. దీంతో టమాటాల ధర పెరిగిందని అంటున్నారు. నెలరోజుల క్రితం రూ.35 పలికిన కిలో టమాటాలు.. ఈ నెల ఏడో తేదీన 70 శాతానికి పైగా వృద్ధి చెంది రిటైల్ మార్కెట్లో రూ.59.87 పలుకుతున్నాయి. అమెజాన్ ఫ్రెష్, స్విగ్గీ, జెప్టో వంటి ప్రముఖ డిజిటల్ సర్వీసెస్ సంస్థల్లో కిలో టమాటాలు రూ.80-90 పలుకుతున్నాయి. సెంటర్ ఫర్ ఎకనమిక్ డేటా అండ్ అనాలసిస్ (సీఈడీఏ) నివేదిక ప్రకారం గత మే నెల నుంచి క్రమంగా టమాటాల ధర పెరుగుతోంది. ఈ నెల ఐదో తేదీ నాటికే దేశవ్యాప్తంగా కిలో టమాటా ధర రూ.59.88 పలికింది. ఉత్తర భారత రాష్ట్రాల్లో కిలో టమాటా రూ.50 పలికితే.. ఈశాన్యంలో రూ.71,, పశ్చిమ భారతంలో రూ.60.5, దక్షిణ భారత రాష్ట్రాల్లో రూ.60 పలుకుతోంది.

గతేడాది కూడా భారీ వర్షాలు, పోటెత్తిన వర్షాలతో కిలో టమాటా ధర రూ.350 పలికిన సంగతి తెలిసిందే. టమాటాలు, ఉల్లిగడ్డ, ఆలుగడ్డ ధరలు పెరిగిపోవడంతో గత నెలలో ప్రతి ఒక్క ఇంట్లో 10శాతం ఖర్చులు పెరిగాయని క్రిసిల్ తెలిపింది. టమాటా ధరలు 30 శాతం పెరిగితే, ఉల్లిగడ్డ ధరలు 60 శాతం వరకూ దూసుకెళ్లాయి. మరోవైపు బంగాళాదుంప 59 శాతం పెరగడంతో ఇండ్లలో కూరల తయారీ కష్టంగా మారిందన్న విమర్శలు ఉన్నాయని క్రిసిల్ తెలిపింది.

# హెచ్‌సీఎల్ టెక్ చైర్‌పర్సన్ రోష్నీ మల్హోత్రాకు ప్రతిష్టాత్మక అవార్డు

హైదరాబాద్, జులై 8 :పారిశ్రామిక దిగ్గజం, హెచ్‌సీఎల్ టెక్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రాకు ఫ్రాన్స్ ప్రభుత్వ అత్యున్నత పౌరపురస్కారం లభించింది.

వ్యాపార ప్రపంచానికి అందించిన సేవలతో పాటు ఫ్రాన్స్, భారత్ మధ్య ఆర్థిక సంబంధాల బలోపేతానికి చూపిన చొరవకు గాను రోష్నీ మల్హోత్రాకు చెవలియర్ నైట్ ఆఫ్ ది లిజియన్ ఆఫ్ హానర్




లభించింది. సామాజిక, పర్యావరణ అంశాలపైనా మల్హోత్రా పనిచేశారు.

ఫ్రాన్స్‌కు అద్భుతమైన సేవలు అందించిన వారికి వారి జాతీయతతో నిమిత్తం లేకుండా ఈ అత్యున్నత పౌర పురస్కారాన్ని అందచేస్తున్నారు. 1802లో నెపోలియన్ బొనపార్టే ఈ అవార్డును నెలకొల్పారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును రోష్నీ మల్హోత్రాకు భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి థియర్రీ మాథ్యూ అందచేశారు. ఢిల్లీలోని ఫ్రాన్స్ రెసిడెన్సీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఫ్రాన్స్ రిపబ్లిక్ అధ్యక్షుడి తరపున రోష్నీ మల్హోత్రాకు చెవలియర్ అవార్డును థియర్రీ మాథ్యూ అందించారు.

ఈ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించడం తాను గౌరవంగా భావిస్తున్నానని, భారత్ - ఫ్రాన్స్ వ్యూహాత్మక సంబంధాలను ఇది ప్రతిబింబిస్తుందని రోష్నీ మల్హోత్రా పేర్కొన్నారు.

ఫ్రాన్స్‌తో హెచ్‌సీఎల్ టెక్‌కు దీర్ఘకాలంగా సంబంధాలు ఉన్నాయని, ఫ్రాన్స్ తమకు వ్యూహాత్మక మార్కెట్ అని ఆమె వివరించారు. ఫ్రాన్స్‌లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు తాము కట్టుబడి ఉన్నామని, ఫ్రాన్స్ వ్యాపారాలను తమ సేవల ద్వారా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సాధించేందుకు తోడ్పాటు ఇస్తామని చెప్పారు.

# రష్యన్ ఫెడరేషన్, ఆస్ట్రియా రిపబ్లిక్ అధికారిక పర్యటనకు బయలుదేరే ముందు గౌరవనీయ ప్రధాన మంత్రి జారీ చేసిన ప్రకటన

న్యూఢిల్లీ, జులై 8 :రష్యన్ ఫెడరేషన్ లో.. 22వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడంతో పాటు ఆస్ట్రియా రిపబ్లిక్ లో మొదటిసారి పర్యటించడానికి గాను మూడు రోజుల అధికారిక పర్యటనకు బయలుదేరు తున్నాను. భారతదేశానికి, రష్యా కు మధ్య విశేషమైన, ప్రత్యేకాధికారాలు కలిగిన వ్యూహాత్మక భాగస్వామ్యం గత పది సంవత్సరాలలో మునుముందుకు సాగిపోతూ ఉన్నది. ఈ భాగస్వామ్యం ఇంధన, భద్రత, వాణిజ్యం, పెట్టుబడి, ఆరోగ్యం, విద్య, సంస్కృతి, పర్యటన రంగాల లోను, రెండు దేశాల ప్రజల సంబంధాలు సహా అనేక రంగాలలో పురోగమించింది.

నేను నా మిత్రుడు, అధ్యక్షుడు శ్రీ వ్లాదిమిర్ పుతిన్ తో కలసి ద్వైపాక్షిక సహకారం లోని అంశాలతోపాటు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పరస్పరం పంచుకోవాలని ఎదురు చూస్తున్నాను. మేం శాంతియుతమైన, స్థిరమైన ప్రాంతాన్ని ఆవిష్కరించడానికి దోహదపడే పాత్రను పోషించాలని కోరుకుంటున్నాం. రష్యా లోని చైతన్యభరితమైన భారత సముదాయంతో భేటీ అయ్యే అవకాశం కూడా ఈ పర్యటనలో నాకు దక్కనుంది. ఆస్ట్రియా లో అధ్యక్షుడు శ్రీ అలెగ్జాండర్ వాన్ డెర్ బెలెన్ తోను, చాన్స లర్ శ్రీ కార్ల్ నెహామర్ తోను నేను సమావేశమయ్యే అవకాశం నాకు లభించనుంది. ఆస్ట్రియా మన దృఢమైన, విశ్వసనీయమైన భాగస్వామ్య దేశం; అంతేకాదు, ఉభయ దేశాలు ప్రజాస్వామ్యం, బహుళవాదం, అనే ఆదర్శాలను పెంచి పోషించుకొంటున్నాము.

